హత్యచేసి చూడు!

కంచర్ల రమణి

"మిస్ లీనాబేబీ!" నా స్వరంలో అనురాగం ఒలక బోస్తూ అన్నాను ఫోనులో.

"యస్ సార్" అంది లీనా ఆ వైపు నుంచి. ఆమె నే నుంటున్న హోటల్ ఎల్లో యెక్స్టసీ రిసెప్షనిస్టు.

" 'యస్ సార్' అంటున్నావు. నే నెవర్నో పోల్చు కున్నావా బేబీ?" అన్నాను, మేటింగ్ సమయంలో పక్షిలా తీయగా.

"అదేమిటి సార్! పోల్చుకోకపోతే 'యస్ సార్' అని ఎందుకంటాను తెలిసినట్టు!...మీరు ఫేమస్ క్రైం కథా రచయిత మిస్టర్ వినాశ్. రూం నెంబరు ముప్పై మూడు నుంచి మాట్లాడుతున్నారు...మీకు ఆకలి బాగా వేస్తోంది.

హోటల్ బాయ్‌ద్వారా డిన్నరు పంపించమంటారు... అవునా?" అంది చిలకలా కిలకిల నవ్వుతూ.

"వెరీగుడ్ బేబీ! ప్రొప్రయిటర్ రమాకాంతం నిన్నొందుకు వదలడం లేదో నా కర్థమయింది." అన్నాను, మెచ్చుకోలుగా.

"థేంక్యూ సార్! థేంక్యూ" అంది లీనా ఫోను పెట్టేస్తూ.

హోటల్ రూం సర్వీసు కోసం ఆమెకు నేను ఫోను చేసినప్పుడల్లా యీ తతంగం జరుగుతుంది.

హోటల్ ఎల్లో యెక్స్టసీలో నాలా పెర్మనెంట్‌గా వుండే కస్టమర్స్ గొంతుకలన్నీ మిస్ లీనాకు పరిచితమే. ఫోనులో మా గొంతుకలు మ్రోగగానే, మేమెవరమో పోల్చుకోగలదు.

అయితే, నేను ఫోను చేసినప్పుడల్లా 'నన్నూ పోల్చుకున్నావా బేబీ?' అని నేను అడగడంలో స్వార్థం, గడుసనం ఉన్నాయి. నేను ఆర్డర్ చేసిన సరుకు నాకే చేరడం ఒకటి. యింకొకరికి అందిన సర్వీసుకు నా ఖాతాలో కర్చు బడకుండా జాగ్రత్తపడ్డం రెండు. మూడు కాస్త కాలక్షేపం.

డిన్నరుకోసం ఎదురు చూస్తుంటే, నా కళ్ళల్లో లీనా రూపం ఆడింది. ఒంటి మీద బట్టలు లేకుండా, పెద్ద వత్తాలతో నా ప్రక్కలో కదులాడే ఆమె శరీరం సాక్షాత్కరించింది నా కళ్ళముందు.

నా ఒళ్లు ఒక్కసారిగా వెచ్చగాఅయిపోయినట్టయింది. నరాల్లో టెన్షన్, ఆమె కావాలన్న తపన ఉధృతమైంది.

మళ్ళా ఫో నెత్తాను. లీనా అటువైపునుంచి పలికింది,

"ఇవాళ కొంచెం ఓవర్ టైం చెయ్యగలవా బేబీ?" అన్నాను.

'ఓవర్ టైం' అంటే అర్థం ఆమెకు తెలుసు.

"ఇవాళా?..." అంటూ ఆగిపోయింది, ఆలోచిస్తున్నట్టు.

అలా ఆగిపోతే, దాని అర్థం నాకు తెలుసు. రాత్రికి నా ప్రక్కలో పొర్లి, వందరూపాయలు కొట్టుకు పోవడానికి ఆమె సిద్ధమే!

ఆమెకు అర్జంటు పనులేమన్నా ఉంటే 'ఓవర్ టైం' పేరెత్తగానే, చప్పున చెప్పేసేది, తనకున్న ఎంగేజ్ మెంట్స్ గురించి.

"మా ఫాదరు అర్జంటుగా రమ్మన్నారు డ్యూటీ అయిపోయిన వెంటనే...అయినా ఫరవాలేదు...ఏదో చెప్తాను లెండి" అంటూ ఫోను పెట్టేసింది.

ఆమె అలా అనడం మామూలే!

రూం సర్వీసు కుర్రాడు తెచ్చిన డిన్నరు తింటున్నానన్న మాటేగాని, లీనా గురించే ఆలోచిస్తున్నాను.

పచ్చని ఒళ్ళు, బంగారపు బంతుల్లాంటి ఆమె వక్షాలు, తల్చుకుంటుంటే, ఆగలేనేమోననిపిస్తోంది, ఆమె వచ్చేంత వరకు.

ఇంకో గంటకుగాని ఆమె డ్యూటీ అయిపోదు. ఆ తరువాత ఆమె తిన్నగా నా గదికే వచ్చేస్తుంది. అయితే, అంతవరకూ, నరాల్ని కండిషనులో వుంచాలి.

డిన్నరు పూర్తయింది. డిన్నరు పూర్తయ్యాక, కాఫీ త్రాగడం అంటే నాకు మహా యిష్టం. బాయ్ తెచ్చిన కాఫీ కూడా త్రాగాక, రోత్ మన్స్ సిగరెట్టు వెలిగించి కాలుస్తూ, గదిలో పచార్లు చెయ్యసాగాను.

భోజనం చేసిన వెంటనే కొంతమందిలా 'అమ్మయ్య' అని అనుకుంటూ ప్రక్కమీదో, వాలు కుర్చీలోనో జేరగిలబడడం అంటే నాకు అసహ్యం.

కడుపులో భోజనం సర్దుకుని, జీర్ణం అయేందుకు వీలుగా పావుగంటయినా బయటకుపోయి నడవడమో, అది వీలుగాక పోతే, గదిలో పచార్లు చెయ్యడమో ప్రాక్టీసు చేసాను ఏళ్ళబట్టి.

అందుకే నాకు యేభై దాటుతున్నా, బొజ్జగాని, ఊబ శరీరంగాని రాలేదు.

లీనా వచ్చేంతవరకూ పచార్లు చేస్తూ, ఆమెను నా ఆలోచనల్లోంచి తప్పించడానికి నిశ్చయించుకున్నాను.

"మర్డర్ ఈజ్ ఎ గేమ్" అన్న నవల రాసి ప్రచురణకర్తలకు పంపి నెలరోజులయింది. నా పుస్తకం ఆమోదించబడినట్టు వారి వద్దనుంచి వర్తమానం ఎప్పుడొస్తుందా అని నెర్వస్‌గా ఎదురు చూస్తున్నాను.

"మాకో నవలరాసి పంపరూ!" అంటూ ఉత్తరాల మీద ఉత్తరాలు రాస్తారు ప్రచురణకర్తలు. నా రచనల్ని వాళ్ళు తిరస్కరించడమంటూ వుండదు, యెప్పుడూ.

అయినా మనస్సులో ఏదో మూల బితుకు; నా రచన్ని తిప్పి కొడతారేమోనని.

కాని అలాంటి బెదురుండడం రచయితకు ఎంతో మేలు. ఒళ్ళు దగ్గర పెట్టుకుని రచనలు సాగిస్తాడు.

ఈ నెల రోజులు ఆ నవల రాసినప్పటి అలుపు తీర్చుకోవడంలో గడిపేసాను. త్వరలో ఇంకో నవల మొదలుపెట్టాలనుకున్నాను.

ఈసారి మాస్టర్ పీస్ రాయాలి. సంవత్సరం అయినా, మంచి ఇతివృత్తాన్ని ఎన్నుకుని మరీ రాయాలి.

దీర్ఘాలోచనలో పడి గదిలో పచార్లు చేస్తున్నాను.

తలుపుమీద టకటకమని చప్పుడు అయ్యింది. లీనాను నేను రమ్మన్న విషయం గుర్తొచ్చింది.

రిస్టువాచీ చూసుకొన్నాను. తొమ్మిదయింది.

"కమిన్" అన్నాను.

మొహమంతా నవ్వులతో లీనా లోనికొచ్చింది, తలుపు తెరుచుకుని.

"వెరీ నైస్ ఆఫ్ యూ. యూ హేవ్ కమ్." అన్నాను ఆమె శరీరం వంపుల మీదకు ఆకలి చూపులు పోనిస్తూ.

నేను రచనా వ్యాసంగంలో మునిగి వున్నప్పుడు, నన్ను ఎవరయినా డిస్టర్బ్ చెయ్యడం సహించను.

అందుకు "సారీ! డోంట్ డిస్టర్బ్ మి" అని చిన్న బోర్డు తయారుచేయించి వుంచాను బయట తగిలించడానికి.

లీనా ఆ బోర్డు తీసుకెళ్ళి బయట తలుపులకు తగిలించి వచ్చింది. తరువాత లోపలనుంచి లాక్ చేసింది.

స్లీపింగ్ సూట్ లోపల నేను నగ్నంగా, సిద్ధంగానే ఉన్నాను.

రెండు నిముషాల్లో లీనా వివస్త్ర అయి, మంచంమీద తలగడల దొంతర్లకు చేరబడి "కమాన్! క్రష్ మి" అంటూ చేతులుచాచి కవ్వింపుగా పిలవగానే, స్లీపింగ్ సూట్ ఒక్క ఊపుతో లాగిపారేసి, ఆమెమీద విరుచుకుపడ్డాను.

అలవాటుగా వేళకు యింత తినాలన్న నియమం అంటే నాకు పరమ అసహ్యం. పేగులు అరిచేంత ఆకలి వేసేంత వరకూ భోజనం చెయ్యను.

సెక్సు తృప్తి విషయంలో కూడా నా భావాలు అంతే శరీరంలోని ప్రతీ అణువూ ఆడదాని పొందుకోసం ఆక్రో

శించేంత వరకూ ఆడదాన్ని తలవను.

ఏళ్లై దాటిపోతున్నా పెళ్ళి విషయం తలవకపోవడానికి కారణం అదే! సెక్సు రొటీను వ్యవహారం కావడం భరించలేను. ఇవా, వంశాభివృద్ధి వగైరా చెత్త నేను విశ్వసించను.

అరగంట తర్వాత అలసిపోయిన నరాలతోటి, తృప్తి పడిన మనస్సుతోటి లేచాను.

ఒళ్ళంతా తేలిగ్గా సుఖంగా ఉంది. మెదడంతా, ప్రశాంతంగా, నిర్మలంగా వుంది.

నేను బాత్ రూంకి నడుస్తుంటే "యూ వాంట్ మీ సెకండ్ టైం?" అడిగింది లీనా మత్తుగా మంచంమీంచి.

"నో. థేంక్యూ" జవాబిచ్చాను.

బాత్ రూంనుంచి నేను తిరిగి వచ్చాక, ఆమె వెళ్లింది.

బట్టలు వేసుకుని లీనా బయలుదేరుతుంటే పది పదులు మడిచి ఆమె హేండ్ బేగ్ లో పడేసి "గుడ్ నైట్" అన్నాను.

లీనా వెళ్లిపోయింది, గుడ్ నైట్ చెప్పి.

2

లీనా వెళ్ళాక, సిగరెట్ వెలిగించి పీలుస్తూ, సోఫాలో వాలిపోయాను.

నా మెదడిప్పుడు పదునుగా పని చేస్తోంది. నేను రాయబోయే నవల గురించి మళ్ళా ఆలోచనలు మొదలయ్యాయి.

ఈసారి మాస్టర్ పీస్ రాయాలి! ఆ విషయంలో మార్పులేదు. గట్టిగా నిశ్చయించుకున్నాను.

క్రైం కథలు ఎన్నో తరహాలుగా రాసాను. ఓసారి రాసిన పద్ధతిలో రాయకుండా రాసాను.

ఈసారి యింకా వినూత్నంగా వుండాలి నా రచన!

కల్పిత కథలు రాసిరాసి విసుగు పుడ్తోంది నాకు.

అయితే, యీసారి నా రచన యెలాంటిదైతే బావుంటుంది? ఆలోచించసాగాను తీవ్రంగా.

ఈసారి యథార్థగాథను దేన్నైనా తీసుకుని నవలగా రాస్తేనో?

ఆ ఆలోచన బాగానే వున్నట్టనిపించింది. అదేమంత కష్టంకాదు కూడా.

ఎన్నో కేసుల్లో నేను పోలీసు డిపార్టుమెంటుకు సాయం చేసాను, క్లిష్టమైన కేసుల్ని పరిష్కరించి, నేరస్తుల్ని అరెస్టు చెయ్యడంలో.

ఫలానా కేసు గురించి ఓ పుస్తకం రాయదల్చుకున్నాను అని నేను చెప్పాలేగాని, పోలీసు డిపార్టుమెంటు తమ ఫైళ్లు యిచ్చి నాకు కావలసినంత సహాయం అందిస్తారు.

కాని—ఒక్కటంటే ఒక్కటి—నాకు జ్ఞాపకం ఉన్నంత వరకూ, గట్టి కేసు—పోలీసుల మేధాశక్తిని పరీక్షించింది లేదు.

నూటికి ఎనభై కేసులు ఎటువంటి వంటే—క్షణికోద్రేకంలో హత్యలు చేసేసి—తామెలాగూ పట్టుబడిపోతామన్న భయంవల్లనో, మరెందువల్లనో—హంతకులు తిన్నగాపోయి పోలీసులకు లొంగిపోతారు.

ఇంకో పది కేసుల్లో, హత్యచేసాక, హంతకులు పారిపోతారు. అయితే, వాళ్లు వెళ్ళిపోతూ, కాయితం

మీద సంతకం చేసినట్టు, హత్యా ప్రదేశంలో తమ వస్తువులు జారవిడుచుకోవడమో, అక్కడున్న వస్తువులమీద తమ వేలిముద్రలు స్పష్టంగా వదలడమో చేసి వెళ్ళిపోతారు.

ఇలాంటి వాటిలో పోలీసుల పని మహాసులువు. 'ఫలానా అప్పారావు ఫలానా పాపారావుని పొడిచి చంపేసాడు. ఉన్నపళంగా కనిపించగానే అరెస్టు చెయ్యవలసింది' అని అన్ని పోలీసు స్టేషన్లకు దేశమంతటా వర్తమానం పంపుతారు.

అంతే! తన కోసం పోలీసులు గాలిస్తున్నారనగానే, అతడి గుండెలు సగం దిగజారిపోతాయి. పోలీసు నిఘా తప్పించుకు తిరగడం కష్టమైపోతుంది, రోజు రోజుకీ.

ఒక రోజున పోలీసులకు తనంతట తానుగా వచ్చి లొంగిపోవడమో, తెలివితక్కువగా చిన్న పొరపాటుచేసి, తన ఉనికి బయటపెట్టుకోవడమో చేసేస్తాడు.

కట్టుదిట్టమైన ఓ పథకం తయారుచేసి, దాని ప్రకారం హత్య చేసేవాళ్ళు బహుఅరుదు.

'మోటివ్' లేకుండా, హత్య జరగడమంటూ వుండదు. 'మోటివ్' ఒక్కటి చాలు, హంతకుడ్ని బయట పెట్టేయడానికి. ఒకవేళ, ఒక హతుడి విషయంలో నలుగు రయిదు గురికి ఒకే సమయంలో 'మోటివ్' ఉన్నా, హంతకుడు పట్టుబడ్డం పెద్ద కష్టంగాదు.

అనాలోచితంగా హత్యాప్రదేశంలో తన వస్తువులు జారవిడుచుకోవడమో, ఒక్కోసారి, యింకొకరిమీద హత్యానేరం నెట్టే ప్రయత్నంలో ఆ వ్యక్తి తాలూకు వస్తువులు వదిలివెళ్ళడంలో ఏవో చిన్న తప్పులు చెయ్యడమో హంతకులు చేస్తారు. అవి వారిని పట్టించేస్తాయి.

అలాంటప్పుడు, జరిగిన హత్య ఆధారంగా నవల రాస్తే, పాఠకుల్ని నిరుత్సాహపరచడమే అవుతుంది.

అయితే, యేమిటి కర్తవ్యం?

యధార్థగాథ ఆధారంగా నవల రాయాలన్న నా ఆశ నిరాశ కావలసిందేనా? ఏ నిర్ణయం తీసుకోలేకపోయాను.

3

ఆమెను ఓసారి చూసాను లిఫ్టులో, నాతోపాటుగ పైకి వెళ్తుండగా.

ఆమె అందం నన్ను దిగ్భ్రాంతుడ్ని చేసింది. నేను యువకుడిగా కలలుగన్న అందాలన్నీ ఆమెలో ఉన్నాయి. పచ్చగా నునుపుదేరిన ఒళ్ళు, ఎత్తుగా ఎదిగి బరువుగా ఊగేవక్షాలు. సగం విచ్చుకున్న కలువల్లా కళ్ళు. పలకరిస్తే చాలు పిలిచినట్టుగా మొహంమీద ప్రత్యక్షమయ్యే చిరునవ్వు.

అంతకుముందెన్నడూ ఆవిడ్ని నేను చూళ్ళేదు. ఆవిడ హోటలుకు వచ్చి, మహా అయితే వారంరోజులయ్యుంటుందేమో!

ఆవిడ నాలాగ పెర్మనెంట్ కస్టమరా? లేక నాలుగు రోజులుండి వెళ్ళిపోయే మనిషా?

రూం సర్వీసు కుర్రాడు అప్పారావును పిలిచాను నా గదికి. పదిరూపాయల నోటు వాడికి అందించాను. వాడు తీసుకోబోతుంటే వెనక్కిలాగేసి "ఒరేయ్! యీ పదీ నీవి కావాలంటే, నాకు కాస్త భోగట్టా కావాలి. చెప్తావా?" అన్నాను.

"అదేమిటి సార్! అలాగంటారు. ఏం కావాలో చెప్పండి. నాకా పది అక్కర్లేదు" అన్నాడు అప్పా

రావు. కాని, వాడికళ్ళల్లో పదిరూపాయలమీద ఆశ తాలూకు మెరుపుపోలేదు.

"ఈ మధ్య మన హోటలుకు కొత్త మొహాలేవో వచ్చినట్టున్నాయిరా?" అన్నాను నేను అడగవలసిన దానికి ఉపోద్ఘాతంగా.

"అదేమిటోనండి. ప్రతి గదిలో ఉన్న బాబులు యిదే అడుగుతున్నారండి నాలుగురోజుల్నుంచి" అన్నాడు అప్పారావు.

"అఁ" అంటూ ఆశ్చర్యం వెలిబుచ్చి, ఆమె గురించి మరో ప్రశ్న అడుగుదామనుకుంటుంటే, "ఆవిడ యే నిమషాన యీ హోటల్లో అడుగు పెట్టిందోగానండీ, మూడో అంతస్తులో మగరాయుళ్ళ రద్దీ యెక్కువయ్యిందండి. వాళ్ళకు తెలీకుండానే 202 నెంబరు గది ముందు, వాళ్ళ కాళ్ళు ఆగిపోతున్నాయండి," అన్నాడు అప్పారావు.

ఆమె మూడో అంతస్తులో 202 నెంబరు గదిలో ఉందన్న విషయం, నేను అడగకుండానే, అప్పారావు చెప్పేసాడు. ఇహ, ఆమె పేరు, ఆమెతో ఎవరెవరు ఉంటున్నారో మొదలైన వివరాలు తెలుసుకుంటే, నేను సంగ్రహించాలనుకున్న భోగట్టా దొరికినట్టే.

నేను అడగ్గానే, అప్పారావు ఆ వివరాలు కూడా చెప్పాడు.

తీరా అడిగాక, నాకేమనిపించిందంటే, ఆమెతో పరిచయం పెంపొందించుకోవడానికి, అప్పారావు అందించిన భోగట్టా ఎందుకూ పనికిరాదు.

ఆమె పేరు విసీల. వరహాల్రాజు అనే వ్యాపారస్తుడు తెచ్చి ఉంచాడు. గదిలో ఆమెతోపాటుగ యింకెవరూ

లేరు. కనీసం రోజుకోసారి, ముఖ్యంగా రాత్రుళ్ళు, ఆమెను చూసిపోవడానికి వస్తుంటాడు వరహాలరాజు.

వరహాలరాజుకు ఆమె అంటే ఎంతో మక్కువ. ఆమె కోరడమే తడవుగా, ఆమె కోరిక తీర్చి పారేస్తున్నాడు.

మరి, ఆమెను నేను లొంగదీసుకోవడం ఎలా?

ఆమె యిష్టాయిష్టాలు, మన సత్త్వం గురించి కొంతయినా తెలిస్తేగాని, ఆమెతో మామ్మూలు పరిచయం కూడా యేర్పరుచుకోలేను.

"చూడు అప్పారావు! ఆమె గురించి నువ్వు చెప్పే భోగట్టా చాలదు. యింకా కావాలి" అంటూ, వాడి జేబులో పదిరూపాయల నోటు కుక్కి, నాకింకా వినీల గురించి యే సమాచారం కావాలో చెప్పాను.

"అలాగే సార్!" అంటూ వాడు గెంతుకుని వెళ్ళిపోబోతూంటే "ఒరేయ్! నేనిలా అడిగినట్టు ఎవరికీ తెలియకూడదు సుమా! జాగ్రత్త!" అన్నాను, వాడి చొక్కా పుచ్చుకుని ఆపి.

"అదేంటి సార్. అలాగంటారు? నేను చచ్చినా యీ రహస్యం యింకొకరికి చెప్పను" అంటూ నాచేతిలో చెయ్యేసి ఒట్టుపెట్టి వెళ్ళిపోయాడు అప్పారావు.

రోత్‌మన్స్ సిగరెట్టు వెలిగించి కాలుస్తూ, సోఫాలో వెనక్కి జారగిలబడి, ఆలోచనల్లో పడ్డాను.

ఒంటిమీద ఒక్క నూలుపోగుకూడా లేకుండా చేసి, వినీలను రాక్షసరతి చేస్తుంటే ఆమె నా ప్రక్కలో ఎలా కదుల్తుందా అని ఊహించుకుంటున్నాను.

నగ్నంగా ఉన్న వినీల అప్పుడే భూమిలోంచి మొలుచుకొచ్చిన దేవతలా నాకు చేరువుగా వస్తుంది. ఆమె మెడ

చుట్టూ చేతులు వేసి, మరిగే వాంఛతో ఆమెను కౌగలించు కుంటాను.

మొదట సున్నితంగా ఆ తరువాత పోను పోను బలంగా దృఢంగా, గాఢంగా, బిగియార కవుగిలించుకుంటాను.

పారవశ్యంవల్లనో, మరెందువల్లనో, ఆమె కళ్ళు మూసుకుంటుంది. నా కౌగిలి సడలించి చూస్తాను.

అరే! అదేమిటి? ఆమె అలా వెనక్కి పడిపోతోందేం? ...ఆమె వెనక్కి వాలిపోయింది చేతనారహితంగా.

ఆమె ముక్కు వద్ద వేళ్ళాడిస్తాను. ఆమెలో ప్రాణం లేదు! ఆమె చనిపోయింది!...నా మనస్సు అదోలా అయి పోయింది.

వినీలను తల్చుకున్నప్పుడల్లా యీ దృశ్యం కళ్ళముం దాడుతోంది. కారణమేమిటి? ప్రశ్నించుకున్నాను నిశితంగా నన్ను నేను.

ఆ దేసమయంలో, నేనో యథార్థ హత్య గురించి రాయాలని నిశ్చయించుకున్న విషయం గుర్తుకొచ్చింది.

అవును! ఆమెను నేను హత్య చేస్తేనో?...నా గుండెలు గుభేలుమన్నాయి, నా కళ్ళముందు_నేను హత్య చెయ్యడం పోలీసులు అరెస్టు చెయ్యడం వగైరా దృశ్యం కనిపించ గానే.

కాని, ఆలోచించాను.

ప్రపంచ సాహిత్య చరిత్రలో యిలాంటి సాహసం ఏ రచయితా చెయ్యలేదు! చెయ్యబోడు! చెయ్యడు!

విజయవంతమైన హత్య చెయ్యడానికి పాటించాల్సిన సూత్రాలన్నీ అవలంబిస్తే, హత్యచేసి శిక్ష తప్పించుకో వచ్చునో లేదో రుజువయిపోతుంది.

ఇది సాహిత్య ప్రపంచంలో నే కొత్త ప్రయోగం!

అతిసులువుగా వినీలను హత్యచేసి తప్పించుకోవడానికి నాకు అవకాశాలు యెక్కువ వున్నాయి.

అశేషంగా క్రైం కధలు రాసి గడించుకున్న అపార అనుభవంతో వినీలను నేను హత్య చెయ్యగలను, పోలీసులకు యే క్లూ దొరక్కుండా.

పైగా, ఆమెను హతమార్చడానికి నాకు 'మోటివ్' లేదు. అందునా, హోటల్లో హత్య జరుగుతుందాయె!

తల క్రిందులుగా తపస్సు చేసినా, నా మీద అనుమాన లేశం కూడా పోలీసులకు కలగడానికి అవకాశం లేదు.

పైగా, కేసు పోనుపోను మరింత క్లిష్టమయ్యే అవకాశం వుంది.

వినీలను యెలాగయినా పొంది తీరాలని, కొంతమంది యువకులు, ఆమె గదిలో జొరబడి, బలాత్కారంగా అనుభవించి, ఆమె బ్రతికివుంటే తమను పోలీసులకు పట్టి ఇస్తుందేమోనన్న భయంతో, ఆమెను చంపి పారెయ్య వచ్చు.

కేసు అలా తప్పుత్రోవ పట్టుతుంది.

చివరకు, వినీలను హత్య చెయ్యాలని నిశ్చయించుకున్నాను.

4

సరిగ్గా రెండు రోజులు పోయాక, అప్పారావు నా గదికి భోజనం తెస్తూ, వినీల గురించి నే నడిగిన అదనపు భోగట్టా అందించాడు.

ఆమెకు థ్రిల్లర్స్, క్రైం స్టోరీస్ అంటే ఎంతో యిష్టమట. ఆడా మగా అన్న తేడా పాటించకుండా అంద

రితో అతిచనువుగా మాట్లాడుతుంది, తిరుగుతుంది.

స్నేహంగా పిలిస్తే చాలు, ఎవరి గదికయినా నిస్సంకో చంగా వెళ్తుందట. అలాగే యితర్లని తన గదికి ఆహ్వా నించడానికి జంకదు.

అయితే, ఆమె చూపే చనువు ఆసరాగా తీసుకుని, ముగ్గురు ఆమెకు యింకా దగ్గరవబోతే, వార్ని భంగపరి చిందట.

దాంతో తతిమ్మా మగవాళ్ళు జాగ్రత్తగా వుండ నారంభించారు. వినీలను ఆరాధించి పలవరించాల్సిందే గాని అనుభవించి ఆనందించడానికి అలవిగాదని తెలుసు కున్నారు.

వినీలను పరిచయం చేసుకోవడానికి కావలసిన వాతా వరణం వుందని గ్రహించాను.

కల్పించుకుని, ఆమెతో పరిచయం చేసుకొన్నట్టుగా గాకుండా, అతిసహజంగా ఆమెతో పరిచయం కావాలని అనువైన సమయంకోసం యెదురుచూస్తున్న సమయంలో— ఓ రోజు ఆమె వున్న అంతస్తు వైపే వెళ్లాను.

ఆమె అదే సమయంలో తన 202 నెంబరు గదిలోంచి బయట కొచ్చింది.

ఆమె చేతిలో ఏవో పుస్తకాలున్నాయి. ఆమె నా కెదురుగా వస్తోంది.

ఆమెను దాటి వెళుతోంటే, ఆమె చేతిలోని పుస్త కాలు జారిపడ్డాయి నేలమీద.

ఆమెను పరిచయం చేసుకునే చక్కని అవకాశం దొరికిందనుకుని, చట్టున నేలమీదకు వంగి, పడిన పుస్త కాల్ని తీసాను.

ఆమెకు తిరిగి అందించే ముందు, అందులో ఒక పుస్తకం వైపు చూసాను.

ఆ పుస్తకం నేను రాసిందే! పేరు 'జాలిగల హంతకుడు'. పాఠకుల్నించి బ్రహ్మాండమైన మెప్పుపొందిన నవలల్లో ఒకటి.

ఆమె విసిగి కాకపోయివుంటే, ఆమెతో పరిచయం కావాలన్న ఉబలాటం నాకు లేకపోయుంటే, ఆమె చేతిలోంచి పడిన పుస్తకాల్ని యెత్తేవాడ్ని కాదు. యెత్తినా, గమ్మున ఆ పుస్తకాల్ని యిచ్చేసి వెళ్ళిపోయేవాడ్ని.

నన్ను నేను యిలా తమాషాగా పరిచయం చేసుకొనేవాడ్ని కాదు.

"చరిత్రలో సువర్ణాక్షరాలతో రాయాల్సిన క్షణం యిది" అన్నాను నవ్వుతూ.

"ఎందుకో చెప్తారా?" అందామె తిరిగి నవ్వుతూ.

"అందమైన ఓ జత చేతుల్లోంచి పుస్తకాలు జారిపడ్డాయి" అన్నాను ఆరంభిస్తూ.

"ఓస్! యింతేనా" అందామె నా మాటల్ని మధ్యతుంచేస్తూ.

"చూడండి! మీకు దేవుడు అందాన్ని హక్కుగా ప్రసాదించాడుగాని, తొందరపడ్డాన్ని మాత్రం కాదు" అన్నాను, తాపీగా, దర్జాగా.

"అబ్బో!" అంటూ ఆమె కళ్ళు గుండ్రంగా కాసేపు త్రిప్పి "చూస్తే మీరు సినిమా డైలాగ్ రైటరులాగున్నారే!" అంది.

"నేను రైటర్ని మాత్రం అవును. కాని సినిమా డైలాగ్స్ మాత్రం రాయను" అన్నాను హుందాగా, ఉత్సాహంగా.

"మీ పేరు?"

"రైటర్‌గా నా పేరు వినాశ్. లోకంలో మాత్రం రాజేశ్వర్రావు."

"ఓహ్!...మీరా వినాశ్!...ఈ పుస్తకం రాసింది మీరే కదూ! వాట్ ఎ సర్ప్రైజ్!...వెరీ గ్లాడ్! వెరీ గ్లాడ్! రండి! రండి!" అంటూ ఆమె కంగారుపడిపోతూ నన్ను తన గదికి లాక్కెళ్ళింది.

"ఇప్పు డర్థమయిందా మీకు?...ఈ క్షణం సువర్ణాక్షరాలతో లిఖించదగిందని ఎందుకన్నానో" అన్నాను ఆమె చూపిన సోఫాలో కూర్చుంటూ.

ఆమె సంతోష సంభ్రమాలకు హద్దులు లేవు. ఏవేవో మిఠాయిలు అందించింది తినమని. తినడానికి మోమాటం చూపితే, ఆమె ఊరుకోలేదు. బలవంతంగా తినిపించింది.

కనీసం రోజు కోసారయినా ఆమె గదికి నేను వెళ్ళి తీరాలి. లేదా ఆమే నా గదికి వస్తుంది. అదీ ఆమె పెట్టిన షరతు.

అంత సులువుగా, ఆమెతో పరిచయం ఏర్పడుతుందని అనుకోలేదు నేను.

5

అవాళనుంచి ఆమెను హతమార్చడానికి అనువైన అవకాశంకోసం అతి జాగ్రత్తగా ఎదురుచూడ సాగాను.

నాకు తెలిసినంతవరకూ, వరహాలరాజు ఆమెను ప్రాణాధికంగా చూసుకుంటున్నాడు.

ఎక్కువ చనువు తీసుకోవడానికి ప్రయత్నించి, ఆమె చేత భంగపాటుపడ్డ యువకుల గురించి జనానికి యిప్పుడు తెలుసు కాబట్టి, ఆమెతో చలాకీగా మాట్లాడ్డానికి మించి

ఎవరూ ఎక్కువ చనువు తీసుకోవడానికి ప్రయత్నించడం లేదు.

ఆరునెలలు గడిచిపోయాయి. ఈ లోపున ఆమెతో నా సాన్నిహిత్యం పెరిగింది. ఆమె ద్వారా నాకు కొంతమంది స్నేహితులు కూడా తయారయ్యారు.

ఇప్పుడు హోటల్ ఎల్లో యెక్స్టెన్సీలో ఆమె లేని పార్టీ లేదు.

ఆమె చెప్పే కులాసా కబుర్ల కోసం, ఆమె కోసమే పార్టీలు యిచ్చినవారు మాలో కొంతమంది లేరనను గాని, ఆమె ఉంటేనే పార్టీకి కళ, జీవం అని ఆమెను విధిగా ఆహ్వానిస్తారు అందరూ తాము యిచ్చే యే పార్టీల కయినా.

రోజులు గడిచిపోతున్నాయి నిస్సారంగా.

నా పథకం మురిగిపోతోందేమోనని నేను లోలోపల బాధపడుతున్న సమయంలో, మా మధ్యకు శ్యాంబాబు అనే రంగేళీ యువకుడు ప్రవేశించాడు.

అతడి వృత్తేమిటో, అతని తల్లిదండ్రులెవరో, నీళ్లలా ఖర్చు చెయ్యడానికి అతనికంత డబ్బు ఎక్కడ్నుంచి వస్తోందో మాకు తెలీలేదు, పరోక్షంగా, ప్రత్యక్షంగా కూడా అతడ్ని అడిగినప్పటికీ.

ఒక్కొక్కరికి ఒక్కో విధంగా జవాబిచ్చేవాడు శ్యాంబాబు. వామనరావు అడిగితే తాను దొంగనోట్లు అచ్చు వేస్తున్నానన్నాడు. కమలాకరమూర్తి అడిగితే 'నాకు లంకెల బిందెలు దొరికాయి' అని జవాబిచ్చాడు.

మాకు చెప్పకపోతే పోనీ, వినీలకయినా చెప్పడా అని ఆ ప్రశ్న ఓసారి వినీలచేతే వేయిస్తే "ఒప్పు. మీ తోడు.

నేను స్టేంటుబేంకులో మాత్రం దొంగతనంచేసి తీసుకు రాలేదు'' అని ఆమెకూ కొంటె సమాధానం చెప్పాడు.

అతడు చెప్పకపోతే పోనీ, అతడి గురించి ఆమాత్రం సమాచారం సేకరించలేకపోతామా అని మాలో కొందరు అతడి మువ్ మెంట్స్ పరిశీలించ నారంభించారు.

అతడు నెల రోజుల కోసారి, దూరంగా ఏదో వూరు పోయి డబ్బు తెచ్చుకుంటుంటాడు. ఊరికి వెళ్ళేముందర ఒక రోజు, వచ్చిన తరువాత ఒక రోజు అతడి మొహంలో ఎందుకో చెప్పలేని దిగులు, బాధ కనిపిస్తుంది.

అంతకుమించి శ్యాంబాబు గురించి యింకే వివరాలు సేకరించలేకపోయారు.

అతడు మా హోటలుకు వచ్చిన మొదటి రోజునే, వినీలవైపు గాఢంగా ఆకర్షింపబడ్డాడు.

రోజులో మూడువంతులు ఆమె సాన్నిధ్యంలోనే గడపసాగాడు.

వాళ్ళిద్దరి మధ్య యేదో వ్యవహారం సాగుతోందని నా అనుమానం.

వాళ్ళిద్దర్నీ నిశితంగా పరిశీలించడానికి తీర్మానించుకున్నాను.

6

ఆవాళ ఉదయం పదీ పదిన్నర కావస్తుండగా ఓ దిక్కుమాలిన స్టేషనులో రైలు దిగాడు శ్యాంబాబు.

అతి దేవూరినుంచి వచ్చాడో, హోటల్లో వుండి అంత జల్సాగా కర్చు చెయ్యడానికి డబ్బెక్కడ్నించి వస్తోందో మొదలైన వివరాలు సంగ్రహించడానికి అతడ్ని రహస్యంగా వెంబడిస్తున్న నేను కూడా అతని వెనువెంటనే రైలు దిగాను.

తలొంచుకుని నడుస్తూ అతడేం ఆలోచిస్తున్నాడో గాని, అతణ్ని నేను అనుసరిస్తున్నానన్న స్పృహే లేదు అతనికి.

స్టేషను బయటకొచ్చి, పొలాల మధ్యనుంచి పోతున్న చిన్న బాటులోకి పట్టాడు అతడు.

మెల్లగా నేను కూడా అతడి వెనకనే పాతిక, యేభై గజాల దూరంలో నడుస్తున్నాను.

శ్యాంబాబు మొదట తోటలో ప్రవేశించాడు. చెట్లను అడ్డం పెట్టుకుంటూ నేనూ లోనికి వెళ్ళాను.

తోట మధ్య చిన్న తాటాకుల గుడిసె ఉంది. శ్యాం బాబు రెండు నిముషాలసేపు గుడిసెలోకి వెళ్ళి బయటకు వచ్చాడు. తోట నలువైపులా చూసి "రామయ్యా! రామయ్యా!" అంటూ గొంతు చించుకుని కేకేసాడు.

రామయ్యకు పిలుపు అందినట్టుంది. "ఎవరూ?" అంటూ అతడు పెట్టిన కేక విన్పడింది జవాబుగా.

"నేనూ...శ్యాంబాబుని" బదులిచ్చాడు శ్యాంబాబు.

ఆ మాట వింటూనే రామయ్య పరుగెత్తుకొచ్చాడు అక్కడకు ఒక్క అంగలో.

"ఎంతసేపయింది బాబూ! మీరొచ్చి?" అని రామయ్య వేసిన ప్రశ్నకు "ఇదే రావడం" అని జవాబిచ్చాడు శ్యాంబాబు.

"పదండి బాబూ! పాకలో కూచుందాం" అంటూ శ్యాంబాబుని పాకవైపు తీసుకెళ్ళాడు రామయ్య.

"అన్నయ్య యింకా రాలేదా?" దోవలో అడిగాడు శ్యాంబాబు.

"వస్తారు బాబూ! గడియకో, గంటకో" చెప్పాడు రామయ్య.

నాకు పాక చాలా దూరంలో ఉంది. వాళ్లు లోపల యేం మాట్లాడుకుంటున్నారో వినబడే అవకాశం లేదు.

వాళ్ళు లోనికి వెళ్ళగానే, నేను చప్పున కదిలి, పాక వెనుకకుపోయి, ఓ చెట్టుచాటున నిలుచున్నాను.

"యేమిటి బాబూ. ఎన్నాళ్ళీ అజ్ఞాతవాసం?" అడుగు తున్నాడు రామయ్య.

శ్యాంబాబు దీర్ఘంగా నిట్టూర్చాడు తప్ప వెంటనే జవాబీయలేదు.

ఒక్క నిముషం పోయాక మళ్ళా రామయ్యే అన్నాడు: "దానికి రోజులునిండి అది చచ్చింది. ఏమిటయితే అదే అవుతుంది. ధైర్యంగా తిరగండి బాబూ. హత్య మీరు చెయ్యనపుడు మీ కెందుకు భయం?"

"అని నీకు తెలుసు. దేవుడికి తెలుసు. కాని లోకు లకు తెలీదు. వాళ్ళకు తెలిసిందంతా; దాని శవంవద్ద పడి వున్న నా వస్తువులు. నాచేతి వేలిముద్రలు. ఎక్కడ బడితే అక్కడ పడివున్న ఆమె గదిలో సామానులు. నేను పోలీసులకు లొంగిపోయి శిక్ష అనుభవించడం తప్ప యింకోమార్గం లేదు" అన్నాడు శ్యాంబాబు.

శ్యాంబాబు చరిత్ర నాకిప్పుడు అర్థమయింది పూర్తిగా. శ్యాంబాబు ప్రేయసినో లేక ఉంచుకున్నదాన్నో ఎవరో ఒకామెను ఎవరో హత్య చేసారు. ఆమె చనిపోయిన గదిలో సామాన్లనిండా శ్యాంబాబు వేలిముద్రలు, అతని వస్తువులు ఉన్నాయి.

లోకం దృష్టిలో, పోలీసుల రికార్డులో శ్యాంబాబు హంతకుడు. అందుకే యింటికి దూరంగా, అజ్ఞాతంగా బ్రతుకుతున్నాడు.

శ్యాంబాబుమీద హంతకుడి ముద్ర ఉంది. ఇవాళ కాకపోతే రేపు పోలీసులకు చిక్కి శిక్ష పొందక తప్పదు.

"తమ్ముడూ! ఎంతసేపయిందిరా వచ్చి?" శ్యాంబాబు అన్న వచ్చినట్టున్నాడు. అతనిగొంతు వినగానే, నా దృష్టి మళ్ళా పాకలోని సంభాషణవైపుకు మళ్ళింది.

"ఇప్పుడే అన్నయ్యా!..." అని ఒక్క క్షణం ఆగి "అమ్మా... నాన్నా ఎలాగున్నారన్నయ్యా?" అడిగాడు శ్యాంబాబు.

"అమ్మ యివాళో రేపో చచ్చిపోయేటట్టుందిరా. నీ గురించి దిగులుతో మంచం యెక్కిపోయింది. నిన్ను చూడాలని వుంది ఆమెకు. ఆమె చచ్చిపోతే... నాన్న గూడా..." ఇహ చెప్పలేక అతడిగొంతుక పూడ్చుక పోయింది.

"ఇదంతా నావల్లనే... ఇదంతా నావల్లనే" శ్యాంబాబు బాధగా రోదించసాగాడు.

"ఊరుకోండి బాబూ! ఊరుకోండి బాబూ!" రామయ్య సముదాయించసాగాడు.

"ఉండు రామయ్యా! నన్ను ఊరుకోబెట్టవద్దు. అందమైన ఆడవాళ్ళను చూసి పొంది తీరాలన్న నా కోర్కే నన్నీస్థితికి దింపింది. ఇంత జరిగినా, అందమైన ఆడవాళ్ళను చూస్తే నా మనస్సు నిలవదు.........అమ్మను చూడాలని వుంది నాకు. వెళ్ళి చూసానా దొరికిపోవడం ఖాయం. నా ఆచూకీ ఎక్కడ దొరికిపోతుందో అన్న భయంవల్లనేగదా యీ రోజువరకూ యింటికి ఉత్తరాలు రాయడం గాని, మీ చేత రాయించుకోవడంగాని చెయ్యడంలేదు" అన్నాడు శ్యాంబాబు ఏడుస్తూనే.

"బాధపడకు తమ్ముడూ! జరగాల్సిందెలాగూ జరుగుతుంది...ఇదిగో డబ్బు!...మళ్ళా రైలుకు ఆలస్యమవుతుందేమో బయలుదేరు" అన్నాడు శ్యాంబాబు అన్న.

"అలాగే అన్నయ్యా! వస్తాను రామయ్యా!" అంటూ శ్యాంబాబు వెలుపలికి వచ్చి బయలుదేరాడు.

శ్యాంబాబు అన్నయ్యను కూడా వెళ్ళిపోనిచ్చి, నేను కూడా తిరుగుప్రయాణం మొదలుపెట్టాను.

తోవలోనే, నా ఆలోచనలకు పరిణితి వచ్చింది.

శ్యాంబాబుకూ వినీలకూ ఎక్కువ స్నేహం ఉంది. వారిద్దరిమధ్య ఉన్న సంబంధం వట్టి స్నేహమేకాదని కొంతమందిలో అనుమానం కూడా ఉంది. ఇందుకు తోడుగా శ్యాంబాబుమీద హత్యానేరం ఉంది.

నేను వినీలను అంతం చెయ్యడమే సంభవిస్తే, ఆ నేరం కూడా అతడిమీదకే వెళ్తుంది.

వినీలను అంతం చెయ్యడానికి ఇంతకుమించిన అనువైన సమయం యేముంది?

7

ఉదయం పదకొండు గంటలవుతుండగా వినీల గది వైపుకు వెళ్ళాను.

వరహాలరాజు లోన ఉన్నాడు. సగం తెరచి వుంచిన తలుపు సందులోంచి అవుపించాడు.

అతడెక్కడికో పైవూరు వెళ్తున్నట్టున్నాడు "మళ్ళా యెప్పుడొస్తారు తిరిగి?" అడుగుతోంది వినీల.

"ఎల్లుండిరాత్రికి వస్తాను" అంటున్నాడు వరహాల్రాజు.

నా ఘెదడులో చిన్న గంట మోగింది. అంటే, యీ

రెండు రోజులు రాత్రిపూట వరహాలరాజు ఆమె గదిలో ఉండడు. ఆమె ఒంటరిగా ఉంటుంది.

వినీలను హత్య చెయ్యడానికి చక్కని తరుణం అని అనుకున్నాను.

వరహాలరాజు ఊరు కెళ్లి పోయాడు.

ఆమెను హతమార్చడానికి అనువైన అవకాశం కోసం యెదురు చూస్తూ, ఆమె గదికి వచ్చేపోయేవారిని గమనిస్తూ, ఆమె గది చుట్టు ప్రక్కలే గడపసాగాను.

ఆ మరుసటి రోజు రాత్రిగాని, నేను కోరిన అవకాశం రాలేదు.

రాత్రి పదకొండు గంటల వరకూ, నేనూ, శ్యాంబాబు యింకో ముగ్గురు యువకులూ, ఆమె గదిలో కబుర్లు చెప్పుకుంటూ కూచున్నాం.

పదకొండున్నర కావస్తుంటే, ఆ ముగ్గురు యువకులు తమకు నిద్ర వస్తోందంటూ వినీలకు గుడ్ నైట్ చెప్పి వెళ్లిపోయారు.

నేను శ్యాంబాబు ఆఖరుకు మిగిలిపోయాం. ఇంక ఆ రాత్రికి వినీల గదికి యెవరూ రారు, మేం వెళ్లిపోతే.

శ్యాంబాబు వెళ్ళిపోయేవరకూ ఉండి, ఆ తరువాత నా పని ముగించుకుని వెళ్ళిపోవాలని నా ఆలోచన.

కాని, ఆఖరి క్షణంలో నా మనసు మార్చుకున్నాను.

రేప్పొద్దున్న వినీల హత్య గురించి దర్యాప్తు ఆరంభమైతే, ఆమెను ఆఖరిసారి బ్రతికుండగా చూసిందెవరు అన్న ప్రశ్న వస్తుంది.

నన్ను వినీలతో వదిలి, తను వెళ్ళిపోయానంటూ శ్యాంబాబు చెప్తాడు, దర్యాప్తుకొచ్చిన పోలీసులతో,

అనుమానం అనవసరంగా నా మీదకు మళ్ళి, వినీలను ఆమె గదిలో సజీవంగా వదిలి వెళ్లినట్టు రుజూ చేసుకునే బాధ్యత, బాధ నాకు తగులుకుంటాయి.

అదంతా దేనికి?

నేను అతనికన్నా ముందు వెళ్ళినట్టుగానో, లేదా అతనితో కలిసి వెళ్ళిపోయినట్టు సాక్ష్యాధారాలుగానీ ఉంటే, నామీద కనీసం పోలీసుల అనుమానపు నీడ కూడా పడదు.

గట్టిగా ఆవలించి, చట్టున లేచి, 'గుడ్ నైట్ వినీల' అన్నాను. ఆమె బదులు 'గుడ్ నైట్' చెప్పింది.

నావైపో చూపు పారేసి ఊరుకున్నాడు శ్యాంబాబు. అతడికింకా, ఆమెతో కబుర్లు చెపుతూ కూచోవాలని ఉందని అర్థం చేసుకున్నాను.

"మీరు రారా?" అన్నాను అప్పటికీ.

"కాసేపుంటాను. ఇంకా నాకు నిద్ర రాలేదు" అన్నాడు శ్యాంబాబు.

"అయితే, నేవెళ్తా. గుడ్ నైట్" అన్నాను నేను, మనస్సులో ఎంతో ఆనందపడ్తూ. నే నాశించినట్టుగానే జరుగుతోంది.

నా గదికి వెళ్ళాను. బట్టలు ఆరవెయ్యడంకోసం కొనుక్కుని వచ్చిన నైలాన్ తాడులోంచి కోసిన రెండు బారల ముక్కను జేబులో వేసుకొన్నాను. గ్లవుజు కూడా రెండో జేబులో వేసుకొని, తొందరగా, మళ్ళా మూడో అంతస్తుకు వచ్చి, కారిడార్ వంపులో స్తంభాలచాటున నక్కి నిలుచున్నాను.

నా గదికి వెళ్ళడానికి మాత్రం లిఫ్టు ఉపయోగిం

చాను. కాని, తిరిగి రావడానికి మాత్రం మేడ మెట్లు ఉప యోగించాను.

లిఫ్టులోగాని, మేడ మెట్లమీద గాని ఎవరూ నాకంట బడలేదు. అంచేత, నేను కూడా ఎవరికంటా బడలేదని నా నమ్మకం.

సరిగ్గా పన్నెండుంపావు కావస్తుండగా శ్యాంబాబు వినీల గదిలోంచి వచ్చాడు బయటకు.

తలూంచుకుని, ఏదో ఆలోచిస్తూ లిఫ్టువద్దకు వెళ్ళాడు.

రెండు నిముషాలు అక్కడ ఆగేసరికి, లిఫ్టు వచ్చింది. లోనికిపోయి, అయిదవ అంతస్తుకు వెళ్ళిపోయాడు.

క్షణం కూడా ఆలస్యం చెయ్యకుండా, వినీల గదికి వచ్చి డోర్ బెల్ నొక్కాను.

రెండు సెకన్లుపోయాక, రెండోసారి బెల్లు నొక్కుదా మనుకుంటుంటే వినీల వచ్చి తలుపు తెరిచింది.

అయితే, తలుపు పూర్తిగా తెరచి నన్ను లోనికి రానీ లేదు చైన్ తగిలించింది.

"మీరా?...యేం పిలిచారు?" అడిగింది.

ఇలా జరుగుతుందని నేనెన్నడూ ఊహించలేదు. డోర్ బెల్ మోగించగానే, తలుపు తెరచి లోనికి రానిస్తుం దని అనుకున్నాను.

చరచకా ఆలోచించాను.

"నా పర్సు మీ గదిలో పడిపోయిందని నా అను మానం," అన్నాను. లోలోన చక్కని అబద్ధం ఆడ గలిగినందుకు పొంగిపోతూ.

"తెల్లవారేవరకూ ఆగితే, అది తీసి దాచేసి, నాకేమీ తెలియదంటానని భయమా?" అందామె, మొహంమీద

నవ్వు మొలిపించుకుంటూ, మనస్సులోని చిరాకు కప్పి పుచ్చుకుంటూ.

"అబ్బెబ్బే. అది కాదు. అందులో నా బీరువా తాళాలు ఉండిపోయాయి. నైట్ డ్రెస్ బీరువాలోంచి తీయాల్సి ఉంది" ఇంకో అబద్ధం జోడించాను మొదటి దానికి.

ఆమె చేత యెలాగోలా తలుపు తీయించాలన్న పట్టుదల పెరిగింది నాలో.

"సరే రండి! చూసుకోండి. ఎక్కడపడిపోయిందో మీ పర్సు" అంటూ ఆమె తలుపుకున్న చెయిన్ తప్పించి, తలుపు బార్లా తెరిచింది.

'అమ్మయ్యా' అనుకుంటూ నేను లోనికి అడుగు పెట్టాను. ఆమె నా ముందు లోనికి నడిచింది.

నేను చప్పున వెనక్కు తిరిగి, తలుపు లాక్ చేసి తాళం జేబులో పడేసుకున్నాను.

క్లిక్ మన్న శబ్దంవిని, ఆమె వెనక్కుతిరిగి "అదేమిటి?" అంది పాలిపోతూ.

"ఏం లేదు" అన్నాను యెలాగో జాగ్రత్తగా నిగ్రహించుకోబట్టిగాని, నా గొంతులోని వణుకు ఆమెకు తెలిసిపోయి వుండేది.

నాలో ఆవేశం పరవళ్ళు తొక్కుతోంది.

చక, చక జేబులోంచి గ్లవుజుతీసి ధరించి, నైలాన్ తాడు బయటకు తీసాను. తాడు కొసలు నా రెండు చేతులకూ చుట్టుకుని పట్టుకుని ఆమెకు చేరువగా వెళ్ళసాగాను.

ఆమె కళ్ళల్లో భీభత్సం తొంగిచూస్తోంది.

"ఏమిటిది? ఎందుకిలా వింతగా ప్రవర్తిస్తున్నారీవేళ?" ఆమె కంఠం వణుకుతోంది, ఆమెలాగే,

ఒకవేళ ఆమె అరిచినా, ఆమె కేకలు బయటకు విన్పడవు. అది ఎయిర్ కండిషన్డు గది. ఆ నిబ్బరం ఉంది మొదటే.

ఆమెను చంపి తీరాలన్న పంతం, కసి నాలో వెర్రి ఆవేశంగా మారింది.

ముందుకు కదిలాను పట్టుదలతో.

భయంతో కాళ్ళూ చేతులు 'ఆడకపోవడం మూలాన్న కాబోలు, ఆమె నన్ను తప్పించుకునే ప్రయత్నం చెయ్య లేదు.

ఆమె మెడచుట్టూ నైలాన్ తాడుచుట్టి, బుల్ వర్కర్ లాగినట్టుగా లాగాను.

ఆమెది మరీ బడుగు ప్రాణమో లేక అప్పటికే భయంతో సగం చచ్చిందో యేమో తెలీదుగాని నిముషాల్లో ఆమె ప్రాణాలు కోల్పోయింది సునాయాసంగా.

ఆమె శవం అసహ్యంగా తెరుచుకున్న నోరు, కళ్ళతో నేలమీద పడిపోయింది.

ఆమెను అలాగే వదిలి వచ్చేస్తుంటే, విసీల హత్యా నేరం శ్యాంబాబుమీద నెట్టేందుకు, హత్యలో 'మోటివ్' అవుపించేలా చెయ్యడం అవసరం అనిపించింది నాకు.

వెనక్కి వెళ్ళాను.

ఆమె ఒంటిమీద బట్టల్ని ఊడలాగేసి, ఆమె స్తనాల మీద, తొడలమీద గాయాలు చేసాను.

నేను చేసిందంతా సవ్యంగానే వుందని ఓసారి జాగ్రత్తగా చూసుకొని, తాళంతో తలుపు తెరిచి తాళంలోనికి గిరవాటేసి, తలుపు దగ్గరగా చేరవేసి, బయటకువచ్చాను దడదడ లాడిపోతున్న గుండెలతో.

కారిడార్ నిర్మానుష్యంగా వుంది యెప్పటిలా. చప్పుడు చెయ్యకుండా త్వరత్వరగా మెట్లు దిగివచ్చి నా గదికి చేరుకొన్నాను.

8

మర్నాడు ఉదయం ఆరు గంటలకే లేచాను.

బాత్ రూంవు కదులుతుంటే వినీల గుర్తుకొచ్చింది. నా చేతుల్లో ప్రాణాలు కోల్పోయి తెరుచుకున్న కళ్ళతో నేలమీద పడిపోయిన ఆమె శవం అవుపించింది నా కళ్ల ముందు.

ఈ రోజునుంచి నాకూ పోలీసు డిపార్టుమెంటుకూ మేధా యుద్ధం. అనిర్వచనీయమైన ఉత్తేజంతో నిండింది నా శరీరం.

కాని, మరుక్షణంలో ఎందుకో దిగులు కలిగింది. కొంప దీసి, సూత్ర ప్రకారంగా వినీలను హత్య చెయ్యడంలో అనాలోచితంగా నేనేమైనా తప్పులు చెయ్యలేదుగదా? అనుకున్నాను.

ఒక్కసారి గడచిన రాత్రి సంగతులన్నీ గుర్తుకు తెచ్చుకొన్నాను.

లేదు! ఒక్క తప్పుకూడా దొర్లలేదు. సోఫాలో నేను కూచున్నప్పటి వేలిముద్రలు తప్ప యింకెక్కడా అవి పడకుండా చేతికి గ్లవుజు తొడుక్కున్నాను. రక్తపాతం వగైరా చీదరలేకుండా, ఆమెను నైలాన్ తాడుతో పీక నులిమి చంపాను.

అంతేగాదు!

హత్య శ్యాంబాబు మీద కొట్టేందుకు వీలుగా, ఆమెను కామించి, కోరిక తీరక బలవంతంగా అనుభవించి చంపి నట్టుగా ఆమె ఒంటిమీద గాయాలు చేసాను,

అయితే నేను చెయ్యవలసింది యింకొక్కటుంది. హత్యకు వుపయోగించిన గ్లవుజు, నైలాన్ తాడు యింకా నావద్దే వున్నాయి. ఎవరూ చూడకుండా వాటిని ప్రక్కనే వున్న సముద్రంలో పారేసి రావాలి.

స్నానాదికాలు ముగించి, ఫలహారం వగైరా కానిచ్చి, సముద్రంలో ఆ వస్తువులను పారేసి వచ్చేసరికి, నేనూహించినట్టుగానే, హోటలు అట్టుడికినట్టు వుడికిపోతోంది, వినీల హత్యతో.

హోటల్లో అప్పటి కలవరానికి కారణం నాకు తెలుసు. అయినా అడిగాను, నాకు దోవలో కనిపించిన వ్యక్తిని.

ఉదయం ఆరింటికి బెడ్ కాఫీ త్రాగే అలవాటుంది వినీలకు.

ఎప్పటిలా వినీల గదికి బెడ్ కాఫీ తీసుకెళ్ళిన రూం బాయ్‌కు, ఆమె శవం దర్శన మిచ్చింది.

కాఫీ ట్రే అక్కడే వదిలేసి దెయ్యంపట్టిన వాడిలా, పిచ్చెత్తిన వాడిలా అరుచుకుంటూ వచ్చి, మేనేజరుకు రిపోర్టు చేసాడు.

ఈ మధ్య మేనేజరు యింటిలో చిచ్చురేగింది. కాలేజీలో చదువుతున్న అతని యిరవై ఏళ్ళ కూతురు ఎవరి వల్లనో గర్భిణి అయింది. ఆ సంగతి కూతురు యెంత జాగ్రత్తగా దాచుదామని ప్రయత్నించినా, తల్లి కని పెట్టేసింది.

పరువూ ప్రతిష్ఠా పోకుండా, కూతురి భవిష్యత్తుకు దెబ్బ తగలకుండా, ఆమెకు గర్భస్రావం యెక్కడ యెలా చేయించాలా అని మేనేజరు బుర్ర బద్దలుకొట్టుకుంటున్న సమయంలో వినీల హత్య సంగతి చెప్పాడు రూంబాయ్.

ఇంచుమించు మేనేజరు పిచ్చివాడయ్యాడు.

నేను మేనేజరు గదికి వెళ్లేసరికి, మేనేజరు చిందులు వేస్తున్నాడు.

నన్ను చూసిన వెంటనే సర్వసాధారణంగా విష్ చెయ్యడమో, పలకరింపుగా నవ్వడమో చేసే మేనేజరు నేను అతనికి చేరువగా పోయి కూచున్నా, పట్టించుకోనే లేదు నన్ను.

"చూడండి. మేనేజర్" అన్నాను మెల్లగా.

గిరుక్కున నా వైపుకు తిరిగి, కోపంగా చూపొకటి పారేసాడు. అంతేగాని, యింకేం మాట్లాడలేదు.

"ఎందుకండీ అంత కంగారు పడిపోతారు?" అన్నాను లాలనగా.

"ఎందుకా?...యీ హోటలు పరువు యింకేమన్నా ఉంటుందా అని! నా జీవితంలో యెరుగను యిలాంటిది" అన్నాడు ఆందోళనగా.

"చూడండి. మీరు చెయ్యగలిగింది చెయ్యలేకపోతే విచారించండి, గాని మీ చేతుల్లో లేని దానికెందుకిలా బాధపడిపోతారు? ఇంతకూ పోలీసులకు రిపోర్టుయిచ్చారా, లేదా?" అన్నాను అతని కర్తవ్యాన్ని గుర్తు చేస్తూ.

"ఆఁ... చేసాను. వస్తారు కొద్ది క్షణాల్లో" అన్నాడు విసుగ్గా, కోపంగా, దిగులుగా.

"సరే! వాళ్లే చూసుకుంటూరు మిగతాదంతా. మీరేం కంగారు పడకండి" అంటూ మేనేజరు మించి నా చూపుల్ని గ్లాసు తలుపుల్లోంచి అవతలకు పోనిచ్చాను.

ముందు సబిన్స్పెక్టరు సీతాపతి, వెనకాల నలుగురు పోలీసులు, ఒక ఫొటోగ్రాఫరు వగైరా మందిమార్బలం హోటల్లోకి వస్తూ కన్పడ్డారు.

వాళ్ళను చూడగానే, నాకు తెలియకుండానే గుండెల్లో వణుకుపుట్టుకొచ్చింది.

సబిన్‌స్పెక్టరు సీతాపతి నాకు బాగా తెలుసు, భలే తెలివైనవాడు. మహాటక్కరి. విపరీతమైన బాహుబల సంపన్నుడు. లోకంలోని న్యాయ, ధర్మాల్ని ఉద్ధరించడానికే పుట్టాడేమో అనిపిస్తుంది.

అయితే చాలా కేసుల్లో నా సహాయం అర్థించాడు. నేనంటే ఏంతో గౌరవం కూడా.

సీతాపతి తిన్నగా మేనేజరు గదిలోకి వచ్చాడు. అటూ యిటూ పచార్లుచేస్తున్న మేనేజర్ని చూసి, ఆ వెంటనే నన్ను కూడా చూసి "అరే! మీరు కూడా యిక్కడే ఉన్నారే!" అని పలకరించి "యేమిటి సార్! మీరున్న హోటల్లోనే హత్య జరిగింది" అన్నాడు ఛలోక్తిగా.

"యేముంది. మీకు యీ మధ్య బుర్ర పదును పెట్టే కేసులు లేవని ఎవడో పుణ్యంకట్టుకుని వుంటాడు" అన్నాను, బలవంతంగా నా మొహంమీదకు నవ్వు తెచ్చుకుంటూ.

మేనేజరు క్షణం ఆలస్యం చెయ్యకుండా మమ్మల్నందర్నీ విసీల గదికి తీసుకెళ్ళాడు.

"ఈ కేసులో కూడా మీరో చెయ్యి వెయ్యాలి" అన్నాడు సీతాపతి త్రోవలో నా భుజంమీద అప్యాయంగా చెయ్యివేసి నొక్కుతూ.

"అలాగే! మీ డిపార్టుమెంటు అనామత్తు పద్దులోంచి ఓ రెండువేలు యిలా పారేయించండి" అన్నాను.

"దానిదేముంది సార్!" అన్నాడు సీతాపతి కులాసాగా నవ్వుతూ.

నాకు మహదానందంగా వుంది. నాకు కావలసింది యిలాంటి యేర్పాటే. హత్యకు సంబంధించిన ఆచూకీ పోలీసులకు ఎంతవరకు చిక్కిందో, దర్యాప్తు ఏ పద్ధతిలో సాగుతోందో ఎప్పటికప్పుడు తెలుస్తూ వుంటుంది. దాన్ని బట్టి పోలీసుల్ని తప్పుత్రోవ పట్టించే పథకం వేయడమో, వీలయితే కన్ఫ్యూజ్ చెయ్యడమో చెయ్యొచ్చు.

వినీల గది చేరుకొన్నాం.

రాత్రి ఆమెను యేస్థితిలో వదిలి వచ్చానో అలాగే పడివుంది. తాము వచ్చేంతవరకూ శవాన్ని కదల్చడంగాని, ఆ గదిలోని వస్తువులు ఉపయోగించడంగాని చెయ్యకూడదని పోలీసులు ముందే చెప్పి ఉంచడంవల్ల, ఆగదికి తాళాలు వేయించి ఓ కుర్రాడ్ని కాపలా వుంచాడు మేనేజరు.

మమ్మల్ని చూడగానే ఆ కుర్రాడు తాళాలు తీసి తలుపులు తెరిచాడు. ఆ క్షణంవరకూ కుతూహలం పట్ట లేక, అక్కడే తారట్లాడుతున్న జనం, తలుపులు తెరవ గానే ఒక్కసారిగా లోపలికి త్రోసుకు రాబోయారు.

అయితే, పోలీసులు వాళ్ళని అదిలించి అదుపులో పెట్టారు.

ఈలోపున పోలీసుల ఆదేశానుసారం, వినీలను వుంచు కున్న వరహాలరాజుకు వినీల హత్య గురించి టెలిగ్రాం ద్వారా తెలియపర్చడం జరిగింది.

ఒక ప్రక్క ఫోటోగ్రాఫరు శవాన్ని, శవం వున్న పరిసరాల్ని వివిధకోణాల్లో ఫోటోలు తీస్తుంటే పౌడరు చల్లి లభ్యమైనంతవరకు వేలిముద్రలకోసం వెతికారు పోలీసులు.

సాయంకాలం అయిదు అయ్యాకగాని, శవాన్ని మార్చ్యురీకి తరలించడం జరగలేదు.

శవాన్ని, శవం వున్న పరిసరాల్ని పోలీసులు పరిశీలిస్తుండగా నేనూ వున్నాను. నన్ను వేలెత్తి చూపించేదేదీ వాళ్ళకు చిక్కలేదు. నా వేలిముద్రలు మాత్రం దొరికుంటాయి. అయితే, నా వేలిముద్రలతోపాటుగ, వినీల మిగతా స్నేహితులందరివి కూడా దొరుకుతాయి. వాటివల్ల నాకే ప్రమాదంలేదు.

నాకు మహదానందంగా వుంది!

9

మర్నాటినుంచి వినీల హత్యకేసు దర్యాప్తు ఆరంభమైంది.

"గురువుగారూ! మీతోనే దర్యాప్తు ఆరంభిద్దాం. ఏమంటారు?" అన్నాడు సీతాపతి.

"అలాగే కానివ్వండి" అన్నాను.

"ఆఖరుసారిగా మీరు వినీలను యెప్పుడు చూసారు?" అడిగాడు సీతాపతి.

"హత్య జరిగిన నాటిరాత్రే...అంటే... మొన్నరాత్రి పదకొండుం పావు...సుమారు కావచ్చు" చెప్పాను జాగ్రత్తగా.

అయినా నా గుండెలు గాభరాగా కొట్టుకోవడం మానలేదు.

ఇలాంటి దర్యాప్తులు చాలా చూసాను. సర్వసాధారణంగా పోలీసులువేసే ప్రశ్నలు యెలా వుంటాయో నాకు తెలుసు. నేర్పుగా జవాబు లీయసాగాను.

"మీరామెను ఆఖరుసారిగా చూసినప్పటి దృశ్యాన్ని వర్ణించండి" అన్నాడు సీతాపతి.

రాత్రి పదకొండుగంటలవరకూ ఎలా ఆమెతో కబుర్లతో గడిపానో, ఆ తరువాత ఎలా ఆమె సెలవు తీసుకుని, శ్యాంబాబును వెనక్కి వదిలేసి వచ్చానో వివరంగా చెప్పాను.

నేను విసీలకు గుడ్ నైట్ చెప్పి వచ్చాక, నా తరువాత శ్యాంబాబు ఆమెతో వున్నాడన్న విషయం అతి నేర్పుగా, అతి స్పష్టంగా పోలీసుల మనస్సులోకి యెక్కించాను.

ఆ అంశాన్ని సీతాపతి ప్రత్యేకంగా నోట్ చేసుకుని అండర్ లైన్ కూడా చేసుకున్నాడు.

"ఇక చాల్లెండి సార్! మీరొచ్చి యిలా నా ప్రక్కన కూర్చోండి. మిగతావాళ్ళని ప్రశ్నిద్దాం" అన్నాడు తన ప్రక్కనున్న ఒక ఖాళీ కుర్చీ చూపిస్తూ.

గుండెలమీంచి యేదో బరువుదించేసినట్టుగా, బరువుగా నిట్టూర్చి, లేచి, సీతాపతి చూపిన కుర్చీలో కూచున్నాను.

హోటలువాళ్ళు పంపించిన కాఫీ త్రాగాకగాని, నా మనసు కుదుటపడలేదు.

ఖాళీ కాఫీ కప్పులు తీసుకుపోతున్న కుర్రాడ్ని ఆపి "శ్యాంబాబుని నేను రమ్మన్నానని చెప్పు" అన్నాడు సీతాపతి.

"అలాగే సర్!" అని చెప్పి కుర్రాడు వెళ్ళిపోయాడు.

నేను ఆలోచనల్లో పడ్డాను.

శ్యాంబాబు చిక్కుల్లో పడ్డం ఖాయం. దర్యాప్తులో అతడి ఊరు, పేరు మొదలైన వివరాలన్నీ చెప్పకతప్పదు.

ఇంకా దూరంపోయి, పోలీసులు ఆరాతీయడం ఆరంభిస్తే, అంతకుముందే అతడిమీద ఓ హత్యాకేసు ఉందని తెలియవస్తుంది. వినీల హత్యానేరం కూడా సహజంగా అతనిమీదే మోపబడుతుంది. పైగా వినీల బ్రతికుండగా చూసిన ఆఖరు వ్యక్తి శ్యాంబాబు.

మేం ఉన్న గదిలోకి మేనేజరు రాగానే, నా ఆలోచనలు ఆగిపోయాయి.

"శ్యాంబాబు కోసం అడిగారుట కదూ?" అన్నాడు మేనేజరు, సీతాపతికి ఎదురుగా వచ్చి నిలుచుంటూ.

"అవును. యేం?" అన్నాడు సీతాపతి, మేనేజరు మొహంలోకి ప్రశ్నార్థకంగా చూస్తూ.

"ఆయన...ఆయన..." నసుగుతున్నాడు మేనేజరు.

"అలా నీళ్ళు నములుతారేం. చెప్పండి" గద్దించాడు సీతాపతి.

"ఆయన నిన్నటినుంచి గదిలో అవుపించడం లేదండి" చెప్పాడు మేనేజరు.

"ఏమిటీ? గదిలో లేడూ?" తను కూర్చున్న కుర్చీలోంచి దూకినట్టుగా లేచాడు సీతాపతి కంగారు పడ్తూ.

"లేడు" చెప్పాడు మేనేజరు.

"ఎక్కడికి కెళ్ళాడో ఎవరితోనయినా చెప్పాడా?"

"లేదండి."

"ఆయన గదితాళాలు మీ వద్ద వున్నాయి కదూ?"

"ఉన్నాయండి."

"పదండి. ఆయన గది చూడాలి" అన్నాడు సీతాపతి లేచి బయలుదేరుతూ.

పట్టరాని సంతోషంగా వుంది నాకు. శ్యాంబాబు

హోటలు వదిలిపోయి వినీల హత్యానేరం పూర్తిగా తన మీదకు తెచ్చుకున్నాడు.

శ్యాంబాబు గదికి వెళ్లాం. మేనేజరు తాళం తీసాడు. బోసిగావున్న గది వాలకంబట్టి, శ్యాంబాబు వున్నఫళంగా హోటలు విడిచి వెళ్ళిపోయాడని అర్ధమవుతోంది.

"శ్యాంబాబు మీకేమన్నా బాకీ వున్నాడా?" అడిగాడు సీతాపతి మేనేజరు వైపు తిరిగి.

"లేదు. గదికి ఓ నెల అద్దె అడ్వాన్సుగా యిచ్చాడు. ఇహ, యేరోజు కారోజు నగదుచెల్లించి గాని, భోజనం వగైరా తీసుకోడు" చెప్పాడు మేనేజరు.

"అయినా, మీకు తెలియకుండా ఆయన ఆ గది ఖాళీ చెయ్యాడం ఎలా జరిగింది?"

"సింపుల్! ఊరుకెళ్ళి వస్తానని ఎప్పటి మాదిరిగా తన పెట్టెలు తీసుకుని బయలుదేరాడు. ఆ తరువాత, ఓ కుర్రాడి ద్వారా గది తాళం మాకు అందజేసాడు."

"సరేలెండి" అని చెప్పి సీతాపతి గది బయటికి వచ్చేసాడు అతనితోపాటుగ మిగతావారం కూడా వచ్చేసాం వెలుపలికి.

"ఈ కేసులో మీ అభిప్రాయం యేమిటి?" అడిగాడు సీతాపతి త్రోవలో.

"ముందు మీ ఆలోచనా ధోరణి చెప్పండి" అన్నాను, వెంటనే అతనికి జవాబీయకుండా.

"నేరస్తుడు తనను తానే బయటపెట్టుకున్నాడు. మీరేమంటారు?" అన్నాడు సీతాపతి, నా కళ్ళల్లోకి నిశితంగా చూస్తూ.

"నేనూ అదే అనుకుంటున్నాను. మా అందరికన్నా, వినీలతో ఎక్కువగా చనువుగా వుంటాడు శ్యాంబాబు.

ఒకనాడు మేం కూడా విసీలను పొందాలని అర్రులుచాచిన వాళ్లమే. అయితే, ఆమె గగన కుసుమమనీ, లేచి వచ్చిందయినప్పటికీ, ఆమెకూ ఓ నీతి వుందని అర్థం చేసుకుని, ఆమెతోటి సాహచర్యమే పదివేలనుకుని ఊరుకున్నాం. అయితే, శ్యాంబాబు యువకుడు. ఆడది మృదువుగా తిరస్కరిస్తే పోనీ లెమ్మని ఊరుకునే రకంకాదు, అతడు. నా ఉద్దేశంలో, ఆమెతో వ్యవహారం సాగిస్తూ వుండాలి. అది, బెడిసికొట్టగానే యీ అకృత్యానికి పాల్పడివుండాలి" అన్నాను అతినేర్పుగా, సీతాపతి మనస్సులోని అస్పష్టంగా వున్న అనుమానాన్ని దృఢపరుస్తూ.

ఆ తరువాత ఆ రాత్రి విసీల గదికెళ్ళి వచ్చిన వాళ్ళందర్నీ ప్రశ్నించాడు సీతాపతి. ఇంచుమించు నా అభిప్రాయాలకు సమానమైనవే వారూ చెప్పారు.

"అంటే, మనం శ్యాంబాబు గురించి వెతకాలి" అన్నాడు సీతాపతి, చివరకు ఓ నిర్ణయాని కొచ్చినట్టు.

"అంత సులువుగా దొరుకుతాడనుకోను. అతన్ని పట్టి తెచ్చి యిచ్చినవారికి గాని, అతని ఆచూకీ అందించిన వారికి గాని, పెద్ద బహుమానమే యిస్తామని పేపర్లలో ప్రకటన వేయించడం మంచిది" సలహా యిచ్చాను.

ఆవాల్టికి దర్యాప్తు ముగిసింది.

10

విసీలను వుంచుకున్న వరహాల్రాజు ఊర్లోకి వచ్చాడనగానే, సబిన్స్పెక్టరు సీతాపతి అతడ్ని హోటలుకు పిలిపించాడు.

వరహాల్రాజుని ప్రశ్నిస్తున్నప్పుడు నేను కూడా వున్నాను.

"ప్రాణానికి ప్రాణంగా మీరు ప్రేమించిన వినీల హత్య చెయ్యబడినందుకు, మీరెంతో విచారిస్తున్నారను కుంటాను. మేం వేసే ప్రశ్నలకు జవాబులిచ్చి మాతో సహకరిస్తే, హంతకుల్ని పట్టి జైలుకి పంపించవచ్చు" అంటూ ఆరంభించాడు సీతాపతి.

"చూడండి సబిన్స్పెక్టరుగారూ! ఎన్నివేలు ఖర్చయినా సరే వెనుకాడకండి. నా వినీలను హతమార్చిన వాడ్ని పట్టి ఉరికంబం యెక్కించండి. అప్పుడుగాని నాకు తిండి సహించదు. నిద్రరాదు. నేను మామ్మూలు మనిషిని కాలేను" అన్నాడు వరహాల్రాజు ఆవేశంగా.

"ఆవేశపడకండి వరహాల్రాజుగారూ! మేమూ అదే ప్రయత్నంలో వున్నాం......వినీల యెవరు? ఆమెను ఎలా యీవూరుకి తీసుకొచ్చారు మొదలైన వివరాలు చెప్పండి" అన్నాడు సీతాపతి అసలు వ్యవహారంలోకి వస్తూ.

"ఆమెను నేను ఓ లాడింగు హౌస్‌లో చూశాను. సరి కొత్తసరుకు అంటూ లాడ్జింగువాడు చెప్పి తీసుకెళ్ళాడు. ఆమెను చూడగానే, నా ఆశ్చర్యానికి అంతులేదు. ఆమె అందం అపూర్వం. గొప్పింటినించి వచ్చిన ఆమెలా వుంది. ఆమెను అన్ని విషయాలూ కనుక్కోవాలని పూను కొన్నాను. కాని, నాకు ఒక్క విషయమూ చెప్పింది కాదు. 'నాకు గతం, వర్తమానాలు లేవు. నాకు భవిష్యత్తు ఒక్కటే వుంది' అని అంది.

"ఆమెను ఆ నరకకూపంలోంచి బయటకు లాక్కొచ్చేంతవరకూ నాకు శాంతిలేదనిపించింది. ఆమెను నాకు వదిలెయ్యాలంటే యేం యిమ్మంటావని లాడ్జి యజమానిని

అడిగాను. 'రెండువేలిచ్చి ఆమెను తెచ్చాం. పైగా దానిమీద వడ్డీ. ఆమె మీతో వెళ్ళిపోవడంవల్ల మాకు కలిగే వ్యాపారనష్టం మొత్తం అయిదువేలు యివ్వండి' అన్నాడు లాడ్జింగు యజమాని. వాడు కోరిన అయిదువేలు వాడి మొహానకొట్టి, ఆమెను యిక్కడకు తెచ్చాను.

"అయితే, గత రెండు నెలల్నుంచీ, మా మధ్య కొన్ని అభిప్రాయభేదాలు తలెత్తాయి. అందుకు కారణం కొంత వరకూ నేనే. 'నన్ను పెళ్లి చేసుకోండి. ఎన్నాళ్ళీ దొంగ బ్రతుకు? సంఘంలో నేను గర్వంగా తలెత్తుకు తిరిగే అవకాశం యివ్వండి' అని రోజూ అనడం ప్రారంభించింది. 'అదిగో! ఇదిగో!' అంటూ దాటి వేస్తున్నాను.

"వినీల కోరికను వెంటనే తీర్చలేక పోవడానికి కారణం నా కుటుంబ వ్యవహారాలు. వినీలకు కబుర్లు చెప్పడమన్నా, ఎవరైనా చెబుతుంటే వినడమన్నా మహా సరదా. ఆమె సరదాని అపార్థం చేసుకున్న వాళ్లెంతమందో ఉన్నారు. ఆమెకు అందమైన మగాళ్ళంటే వెర్రి అనుకుని కొంతమంది ఆమెను లోబరుచుకోబోయారు. ఆమె తిరస్కరించింది వారిని సుతిమెత్తగా.

"అందుకు ప్రతిగా, మగాళ్లతో స్నేహం తగ్గించుకోమని నేను నిత్యమూ పోరసాగాను. 'నేను సంతలో చింత పండులాంటి దాన్ని. ఎవరైనా బేరమాడి కొనుక్కోవచ్చు' అని పెళుసుగా జవాబిచ్చేది. అందుకు నేను కోపం తెచ్చుకోబోతే 'చూడండి! పెళ్ళయిన ఆడదాని వైపు కళ్ళెత్తి చూడాలంటే, ఏ మగాడయినా ఒకటికి పది సార్లు ఆలోచిస్తాడు. కాబట్టి నన్ను పెళ్ళి చేసుకోండి అని అనేది" అని ముగించాడు వరహాలరాజు వినీల వృత్తాంతం.

"ఆమెకు మగాళ్లతో స్నేహం యెక్కువంటున్నారు. అటువంటప్పుడు, మీకు ప్రత్యేకంగా యే మగాడి మీదన్నా అనుమానం వుందా?" ప్రశ్నించాడు సీతాపతి రెండు నిముషాలు పోయాక.

"అనుమానించాల్సి వస్తే యీ హోటల్లోవున్న మగాళ్ల నందర్నీ అనుమానించాలి. ఆఖరుకు యీ రచయితగార్ని కూడా" అన్నాడు వరహాల్రాజు నా వైపు చెయ్యి చూపించి.

నా గుండె గుభేలుమంది, నాకు తెలియకుండానే.

"కాని" వరహాల్రాజే మళ్లా చెప్పసాగాడు. "వినీల చనిపోయాక, శ్యాంబాబు పారిపోవడంతో, నాలో పొడ చూపిన కొన్ని అనుమానాలు యిప్పుడు నిజమేనేమోనని అనిపిస్తున్నాయి."

"ఏమిటవి?" మధ్యలో అడ్డు తగిలి అన్నాడు సీతాపతి.

"పగలనక, రాత్రనక, ఎప్పుడూ మా గదిలోనే వుండేవాడు శ్యాంబాబు వినీలతో కబుర్లు చెప్పతూ. నేను వుంటే మాత్రం వుండేవాడు కాదు. అయితే, నేనలా బయటికి వెళ్ళిపోయానని తెలియగానే, మరుక్షణంలో తయారయ్యేవాడు. చూపుల్లోనూ, చేష్టల్లోనూ, తన కోరిక వ్యక్తపరిచేవాడు శ్యాంబాబు మొన్న మొన్నటివరకూ. ఈ మధ్యనే, నోటితో చెప్పాడట వినీలకు. 'అందుకే, మగాళ్లతో స్నేహం తగ్గించుకోమని చెప్పాను' అని వినీలను మందలించాను. ఎందుకో వూరుకుంది. ఆ ప్రస్తావన మరి యెత్తలేదు. సుతిమెత్తగా అందరికిలాగే, అతడ్ని మంచి మాటలతో బుజ్జగించి వుంటుంది. అతడి గురించి

మరి యే ఫిర్యాదు చెయ్యలేదు ఆ తరువాత," చెప్పాడు వరహాలరాజు.

"ఇంకా మీ మనస్సులో యేమన్నా రహస్యాలు దాగి వుంటే, అవి వినీల కేసును పరిష్కరిస్తా యనుకుంటే చెప్పండి" అన్నాడు సీతాపతి.

"ఇంకేం లేవండి" అన్నాడు వరహాలరాజు, రెండు నిముషాలు దీర్ఘంగా ఆలోచించి.

"అయితే మీరిక వెళ్ళవచ్చు" అని సీతాపతి అనగానే, అతనికి నమస్కరించి వెళ్ళిపోయాడు వరహాలరాజు.

"వరహాలరాజు మీద మీ అభిప్రాయం యేమిటి?" అడిగాడు సీతాపతి నా వైపు తిరిగి వరహాలరాజు వెళ్ళిపోగానే.

వెంటనే నేను యే జవాబు చెప్పలేదు.

నాలుగయిదు నిముషాలు ఆలోచించాను.

వినీలకూ, వరహాలరాజుకు అభిప్రాయ భేదాలున్న విషయం నా కింతవరకూ తెలీదు. ప్రస్తుతం శ్యాంబాబు హంతకుడు అన్న దిక్కుగా సాగుతోంది పోలీసుల ఆలోచన.

వరహాలరాజు చెప్పిన సంగతుల్ని ఆధారం చేసుకుని కేసుని మరింత గజిబిజి చేస్తేనో?

అవును! అలా చెయ్యడంవల్ల కొన్ని ప్రత్యేక లాభాలున్నాయి!

శ్యాంబాబు దొరికినా, దొరక్కపోయినా, కేసు అనుమానాల సుడిగుండంలో పడుతుంది. ఎటూ తేలదు.

మెల్లగా చెప్పసాగాను.

"వరహాలరాజు కథవల్ల మనకు మరికొన్ని కొత్త విషయాలు తెలిసాయి. వినీల, వరహాలరాజుల మధ్య మనం

అనుకుంటున్న సామరస్య సంసారం సాగడం లేదు. వినీల లేచివచ్చిన బాపతు. ఆమె అందానికి ఆకర్షింపబడో, యింకో కారణంవల్లనో, క్షణికో ద్రేకంలో లాడ్జింగ్ నుంచి, ఆమెను తీసుకొచ్చాడు వరహాల్రాజు. అయితే, వినీల దూరాలోచనగల ఆడది. వరహాలరాజును పెళ్లి చేసుకోవా లన్న ఆశతో వుంది. వినీల అలా పట్టుబడుతుందని అను కోలేదు వరహాల్రాజు. సంఘంలో అతడి గౌరవజీవితం దెబ్బతినే అవకాశం వుంది. వినీల రోజు రోజుకీ అతడికో తలనొప్పిగా తయారయ్యింది. ఆమెను వదిలించుకోవాలని యీ సాహసం చేసాడేమో? ఇది నా అనుమానం ఆలో చనా రీతి మాత్రమే'' అన్నాను.

''అయితే'' అందుకున్నాడు సీతాపతి. ''మీ ఆలోచ నల్లో చిన్న లోపం వుంది. ఇద్దరు పెళ్లాలుంటేనే, తన గౌరవజీవితం దెబ్బతింటుందని భయపడ్డ వరహాల్రాజు, హత్యకు సిద్ధపడగల డంటారా? అంతేగాదు. పరపురుషు లతో చనువుగా తిరిగే ఆమెను వారించేవాడు కాదు. పైగా ప్రోత్సహించేవాడు. ఎవడ్నో ఒకడ్ని తగులుకుని ఆమె వెళ్లిపోతే, వరహాల్రాజు యిబ్బంది సునాయాసంగా తొలగిపోతుంది.''

సీతాపతి తెలివితేటలు చూసి నా గుండెలు గుభేలు మన్నాయి. నా వాదనలోని లోపాలన్నీ ఒక్క క్షణంలో ఏరిపారేసాడు.

''అబ్బెబ్బె! నా ఉద్దేశం వినీలను వరహాల్రాజు హత్య చేసాడని కాదు. అతడి కదలికల్ని కూడా పరిశీలించి చూడాలని'' సర్దాను.

''అవునవును! అది నిజమే. అతడ్ని అనుసరించి, అతడి గురించి భోగట్టా సేకరించమని యిద్దరు పోలీసుల్ని నియ

మిస్తాను” అన్నాడు సీతాపతి.

నా గుండెలు స్థాయినబడ్డాయి, సీతాపతి అలా అన డంతో.

11

రెండు నెలలు గడిచిపోయాయి. వినీల హత్య కేసు ఎటూ తేలలేదు.

వారానికి రెండుసార్లయినా హోటలుకివచ్చి, ఎవరోన్ని ఒకర్ని ప్రశ్నించి, నా సలహా అడిగి వెళ్లిపోతున్నాడు సబిన్స్పెక్టరు సీతాపతి.

శ్యాంబాబు పోలికలు యిచ్చి ఓ ప్రకటన వేయించింది పోలీసు డిపార్టుమెంటు, దేశంలోని ప్రముఖ పత్రికల్లో.

దాని ప్రకారం శ్యాంబాబుని బంధించి తెచ్చిన వారు గాని, లేదా అతని ఉనికికి సంబంధించిన ఆచూకీ యిచ్చిన వారుగాని, వెయ్యిన్నూట పదహార్ల బహుమానం పొందు తారు.

శ్యాంబాబు గురించి ఏవో రెండు మూడు వర్తమానాలు వచ్చాయిగాని, తీరా పోలీసులు వెళ్లి చూసేసరికి, ఆ వ్యక్తి ఎవరో అక్కడ్నుంచి అదృశ్యంకావడమో ఒక వేళ వున్నా ఆ వ్యక్తి, శ్యాంబాబు కాకపోవడమో సంభవించింది.

వ్యాపారరంగంలో వరహాలరాజుకు పెద్ద పేరుంది. అతని తండ్రి బంగార్రాజు దేశంలోని అనేక సంస్థలకు భూరివిరాళాలు యిచ్చాడు. ప్రతి స్కూల్లోనూ, ప్రతి కాలేజీలోనూ అటు పేదవిద్యార్థులకూ, యిటు తెలివైన విద్యార్థులకూ సహాయం చెయ్యడంకోసం, వరహాలరాజు గారి పేర, అతని భార్య పేర, అతని తండ్రి పేర స్కాలర్ షిప్స్ వున్నాయి.

అయితే, అతడిలో బలహీనత వుంది. అదే స్త్రీలో లత్వం! ఆ సంగతి భార్యకు తెలుసు. పిల్లలకు తెలీదు. వినీలను తెచ్చి హోటల్లో వుంచి పోషిస్తున్న సంగతి భార్యకు తెలుసు.

"పోన్లెండి! ముక్కూ మొహం తెలీని ఆడవాళ్లవద్దకు పోయి రోగాలు అంటించుకుని బాధపడ్డంకన్నా యిది నయం" అందిట ఆమె, వినీల గురించి వార్త ఆమె వినగానే.

అంతటి సహనశీలను వదిలెయ్యడంగాని, ఆమె హోదా తగ్గించడంగాని వరహాల్రాజుకు యిష్టంలేదు. అందుకే వినీలను పెళ్లి చేసుకోలేదు.

సీతాపతి హోటలుకు వచ్చి రెండు వారాలకుపైగా దాటింది. వినీల హత్యకేసు గురించి కొత్త విషయాలు తెలియడంలేదు.

కేసు ఎంతవరకూ వచ్చిందో, యేం కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయో తెలుసుకోవాలన్న కుతూహలం పట్టలేకపోయాను.

నేనే పోలీసు స్టేషనుకు వెళ్ళాను. నేను వెళ్లేసరికి, సీతాపతి లోనికి ఆహ్వానించాడు నన్ను. తన కెదురుగా వున్న కుర్చీ చూపించాడు కూర్చోమని.

"ఏమిటీ మధ్య హోటలుకు రావడం మానేసారు?" అన్నాను మెల్లగా.

"ఇంక రావడం అనవసర మనిపిస్తోంది" చెప్పాడు సీతాపతి.

"ఏం అలాగ?" ఆశ్చర్యంగా అడిగాను.

"నిన్నసంటె నిన్న స్వయంగా వచ్చాడు శ్యాంబాబు పోలీసు స్టేషనుకు."

"వచ్చి?" అన్నాను కుతూహలంగా మధ్యలో కల్పించుకుని.

"తనెందుకు పారిపోవాల్సి వచ్చిందో చెప్పాడు. కావలిస్తే దర్యాప్తు చేసుకోమన్నాడు."

"ఏం చెప్పాడు?"

ఆవేశంతో గుబగుబలాడిపోతున్న గుండెల్ని అదుపులో పెట్టుకోలేక పోతున్నాను.

"తనమీద యింకో హత్యానేరముంది. దర్యాప్తులో ఆ విషయం యెలాగూ బయటకు వస్తుంది. విసీలను తను హత్య చెయ్యలేదని యెంత గోలపెట్టినా, మేం వినమని పారిపోయాడట."

"అయితే, ఆ కేసేమయింది?"

హత్య జరిగి ఆ నేరం ఓసారి ఒకడిమీద మోపడమే జరిగితే, అందులోనుంచి వాడు బయటపడ్డం ఒకటా?

ఏం జరిగుంటుంది? కుతూహలం పట్టలేకపోతున్నాను.

"శ్యాంబాబు తల్లి చనిపోతూ కొడుకు పేరే తలుచుకుని తలుచుకుని ప్రాణాలు వదిలిందట. కొడుకును చూడాలన్నది ఆవిడ చివరికోరికట. అయితే కొడుకు అక్కడకుపోలేదు. అతని మీద పోలీసుల నిఘా ఉంది. కొడుకును తలుచుకుంటూ, ప్రాణాలు పోగొట్టుకున్న ఆ తల్లి హృదయవిదారక స్థితి చూశాడు శ్యాంబాబు ప్రేయసిని హత్యచేసిన హంతకుడు. ఆ క్షణం వరకు అతనిలో మరుగుపడ్డ మానవుడు అతనిలోని రాక్షసాంశమీద ఎదురు తిరిగాడు, వెంటనే జరిగిందంతా చెప్పేస్తూ, శ్యాంబాబు నిర్దోషిత్వాన్ని తెలుపుతూ, ఒక స్టేట్‌మెంట్ యిచ్చి, తనంతట తను పోలీసులకు లొంగిపోయాడు ఆవ్యక్తి" అంటూ ముగించాడు సీతాపతి శ్యాంబాబు వృత్తాంతాన్ని.

నేనాశించని మలుపు తిరిగింది కథ. శ్యాంబాబుమీద ఓ హత్యానేరం ఉంది కాబట్టి, వినీల హత్యానేరం కూడా అతడి మీదకే వెళ్తుందనుకున్నాను. కొద్ది రోజులపాటు అలాగే జరిగిందికూడా.

అయితే పాత నేరం విషయంలో అతడు నిర్దోషిగా నిరూపింపబడ్డాడు. ఇహ, వినీలనుకూడా అతడు చంపలేదు. ఈ కేసులోకూడా తను నిర్దోషని శ్యాంబాబు వాదిస్తే, అతడి వాదానికి బలం వస్తుంది, పోలీసు డిపార్టుమెంటు, కోర్టు, లోకం అతడి గోడు వింటుంది, నమ్ముతుంది.

ప్రస్తుతానికి పోలీసువాళ్ళ ఆలోచనలు ఎలా ఉన్నాయో తెలుసుకోవడం తప్ప నేను వేరే చెయ్యగలిగిందేమి లేదు.

"అయితే, యేంచేద్దామనుకుంటున్నారు?" అడిగాను, రెండు నిమిషాల మవునానంతరం.

"యేముంది...అటు వరహాల్రాజుకు వినీలని చంపడంలో 'మోటివ్' లేదు. ఇటు శ్యాంబాబు, దొరికిన దొంగ— దొంగ కాదు, మొదట అనుమానించినట్టుగా. కేసు మళ్లా మొదటికొచ్చింది. హంతకుడెవరోగాని, మహా తెలివిగా హత్య చేశాడు. కామ దృష్టితో హత్యచేసినట్టు పైకి అనిపిస్తోంది కాని, అతడి మోటివ్ అర్థంగావటంలేదు. కేసంతా పునఃపరిశీలనం చెయ్యడం తప్ప వేరేగత్యంతరం లేదు. ఈలోపున మీరు కూడా దీనిగురించి జాగ్రత్తగా ఆలోచించి అయిడియాస్ యేమన్నా ఉంటే చెప్పండి" అన్నాడు సీతాపతి.

12

అవాళ ఉదయం పదకొండు గంటలయింది. బయట "ప్లీజ్ డోన్ట్ డిస్టర్బ్ మీ" అన్న బోర్డు పెట్టి, గదిలో

కూచుని నవల రాయడంలో మునిగిపోయాను.

గదిలో ఫోన్ మ్రోగింది. ఎత్తేసరికి లీనా గొంతు పలికింది అందులో.

"ఎస్ మైడియర్! వాట్ కెన్ ఐ డూ ఫర్ యూ?" అన్నాను హుషారుగా.

"సీతాపతిగారినుంచి మీకో పిలుపు వచ్చింది సార్! మిమ్మల్ని తీసుకు రమ్మని జవాన్ని పంపించారు. బయట 'డోంట్ డిస్టర్బ్' బోర్డు చూసి తలుపు తట్టడానికి జంకి ఫోన్ చెయ్యమని బ్రతిమాలుకున్నాడు నన్ను" చెప్పింది లీనా.

సీతాపతి నన్ను పిలవనంపాడన్న విషయం వినగానే, నా గొంతు ఎవరో పట్టి నొక్కినట్టయింది. ఇందాకటి హుషారు యెగిరి పోయింది.

ఒక్క క్షణం మాటాడలేక పోయాను. తేరుకుని "ఎందుకుట!" అన్నాను.

నాగొంతు నాకే విచిత్రంగా ధ్వనించింది ఆక్షణంలో.

"వినీల కేసు విషయంలో కొత్త సమాచారమేదో దొరికిందట. మీతో అర్జంటుగా చర్చించాలట" అందామె.

"అయితే వెళ్ళక తప్పదంటావా డియర్?" అన్నాను పైకి. కాని, లోలోన, అదేమిటో తెలుసుకోవాలన్న తపనంగా ఉంది.

"మిమ్మల్ని తప్పక తీసుకురమ్మని జవానుతో మరీ మరీ చెప్పి పంపారట. మిమ్మల్ని యెక్కువసేపు ఉంచెయ్యరట" అంది లీనా.

"ఓకే! అయిదు నిమిషాల్లో బట్టలు మార్చుకుని వస్తా

న్నానని చెప్పి జవాన్ను పంపేయ్'' అన్నాను ఫోను నా చెవినుంచి దూరం చేస్తూ.

''అలాగే సర్!'' అంటూ లీనా ఫోను పెట్టేసిన శబ్దం లీలగా విన్పించింది, క్రేడిల్ చేస్తున్న ఫోనులో.

బట్టలు మార్చుకుని, ఆటోరిక్షాలో స్టేషనుకు బయలు దేరాను.

నా కోసమే సీతాపతి యెదురు చూస్తున్నాడేమో, నన్ను చూడగానే అతని మొహం విప్పారింది.

''రండి సార్! రండి'' అంటూ నన్ను ఆహ్వానించి, తన కెదురుగా వున్న కుర్చీలో కూచోమన్నాడు.

కూచున్నాను 'థేంక్స్' చెప్పి.

''వీరాస్వామీ! ఆ ప్లాస్టిక్ సంచీ యిలా పట్రా!'' కేకేసాడు సీతాపతి ఒక పోలీసు జవాన్నుద్దేశించి.

వీరాస్వామి అక్కడున్న ఓ కర్ర బీరువాలోంచి నీలం రంగు ప్లాస్టిక్ సంచీ తీసి తెచ్చి సీతాపతి టేబిలుమీద వుంచాడు.

ఆ సంచీని చూడ్డంతోనే నా ప్రైప్రాణాలు పైపై ఎగిరి పోయాయి.

వినీలను హత్య చెయ్యడానికి నేను ఉపయోగించిన నైలాన్ తాడు, ఆ సమయంలో నేను చేతులకు ధరించిన గ్లవుజు, ఆ ప్లాస్టిక్ సంచిలోనే వుంచి, సముద్రంలో పారేసాను.

అదే యిప్పుడు నా ఎదురుగా వుంది!

అది సీతాపతికి యెలా దొరికింది?

''మీ కిది యెక్కడ దొరికింది?'' అన్నాను నాలో రేగుతున్న కలవరాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తూ.

"మొన్న సాయంకాలం మా జవానొకడు సముద్ర పొడ్డుకు షికారు వెళ్ళాడు. ఇంటి దగ్గర యేదో తగువైందట. మనస్సు బాగోలేక, అలా సముద్రపొడ్డున నడుచుకుంటూ చాలా దూరం వెళ్ళాడట. అక్కడ సగం ఇసుకలోనూ, సగం ఒడ్డుమీదపడి వున్న యీ సంచీ అవుపించిందట. మనుషులు తిరుగాడని యీ స్థలంలో యిదిక్కడ కెలా వచ్చిందో అనుకుని చేతిలోకి తీసి చూసాడట. లోపల గ్లవుజు, నైలాన్ తాడు అవుపించాయట. నాకిచ్చాడు స్టేషనుకు తెచ్చి. వినీల హత్య యెలా జరిగిందో పోస్టుమార్టమ్‌లో తెలిసిన వివరాలు అతడికి తెలుసు" చెప్పాడు సీతాపతి.

అయోమయావస్థలో పడ్డాను నేను. ఆ నైలాన్ తాడు, గ్లవుజు తొందరగా వదిలించుకోవాలి, ఆ పని యెవరూ చూడరాదన్న ఆతృతలో ఆ సంచీని సముద్రంలో పారేసాను.

సముద్రంలో యేది పారేసినా ఒడ్డుకు కొట్టుకొస్తా యన్న విషయం ఆ క్షణంలో యెలాగో మరవునబడింది.

ఆ సంచీ తిన్నగా వచ్చి పోలీసుల చేతిలో పడింది. నాలో ఝుంఝూమారుతం రేగింది.

అయినా...ఒక్క క్షణం మనస్సును కేంద్రీకరించాను. నా భయానికి ఆధారమేదైనా వుందా అని ఆలోచించాను.

నిజమే! వినీలను అంతం చెయ్యడానికి ఆ వస్తువుల్ని వుపయోగించాను.

అయితే, అది నేనేనని పోలీసులు యెలా తెలుసుకో గలరు?

ధైర్యం చేరుకుంది గుండెల్లో!

"బావుంది! ఇహ వీటి సాయంతో మనం హంతకుల్ని

పట్టుకోవడమే తరువాయి" అన్నాను దీర్ఘంగా నిట్టూర్చి, అప్పుడే ఆలోచనల్లోంచి తేరుకున్నట్టుగా.

"అవును! ఈ వస్తువుల్ని ఆ వ్యక్తి సముద్రంలో పారేసాడంటే, అతడెవరో పైవాడుకాదు. హోటల్లో వున్నవాడే! హోటలు వెనకనే గదా సముద్రముంది! అంతేగాదు. సాధారణంగా నైలాన్ తాడు నిర్ణీతమైన కొలల్లోగాని కొట్టువాడు అమ్మడం జరగదు. అంటే హంతకుడివద్ద, యీ ముక్క కోయగా మిగిలిన తాడు వుండదన్న మాట."

"అయిడియా అద్భుతంగా వుంది" అన్నాను పైకి అతన్ని మెచ్చుకుంటూ. కాని, భయం ఉప్పెనలా పెరుగ సాగింది.

తడిబట్టల్ని ఆరబెట్టడానికి వీలుగా తాడు కట్టడానికి రెండు మీటర్ల నైలాన్ తాడు కొనితెచ్చాను బజారునుంచి. అందులో ఒ ముక్క కోసి, వినీల హత్యకోసం ఉపయోగించాను. మిగిలిన తాడు గదిలోవుంది. దాన్ని వెంటనే వదిలించుకోవాలి. ఈ క్షణంలో హోటల్లోని గదులన్నీ పోలీసులు చెక్ చెయ్యడం ఆరంభిస్తే, నేనే హంతకుణని నిర్ధారణ కావడానికి యెంతోసేపు పట్టదు.

వెంటనే గదికిపోయి, ఆ తాడును వదిలించుకోవాలన్న ఆరాటం మొదలయ్యింది నాలో.

నేను కూచున్న కుర్చీ ముళ్ళకంపలా వుంది.

"అయితే రేపు చెక్ చేసేద్దాం హోటలు గదులన్నీ" అన్నాను. అలా అయితే, మిగిలిన నైలాన్ తాడు వదిలించుకోవడానికి నాకు కావలసినంత వ్యవధి వుంటుందని ఆశ!

"అలాగే. మీరూ సాయం చేయాలి" అన్నాడు సీతాపతి.

"తప్పకుండా!" అన్నాను, నేను చెప్పిందానికి సీతాపతి ఒప్పుకున్నాడన్న ఆనందంతో ఉక్కిరి బిక్కిరవుతూ.

వెంటనే సీతాపతి వద్దనుంచి శెలవు తీసుకుని గదికి బయలుదేరాను.

గదికి వస్తూనే, నా గదిలో మిగిలిన ఆ నైలాన్ తాడు తీసుకున్నాను. న్యూస్ పేపరులో పొట్లాంగా కట్టాను. చిన్న సంచీలో ఆ పొట్లాన్ని పడవేసి, హోటలు వెలుపలికి వచ్చాను తొందరగా.

ఖాళీ ఆటోరిక్షా నేను వెళ్తున్న దిశకే వెళ్తుంటే ఆపి, యెక్కి కూచున్నాను.

నాలుగయిదు వీధుల్లోంచి పోనిచ్చి, ఓ చోట దాన్ని ఆపి కిరాయి చెల్లించి పంపి వేసాను.

రిక్షా మరుగయ్యేంతవరకూ నేను నిల్చుని చూసి, త్వర త్వరగా మున్సిపాలిటీ వాళ్ళు చెత్తకుప్పలు పారబోసే మైదానం వద్దకు పరుగెత్తాను.

నలుదిక్కులా నా చూపుల్నోసారి ప్రసరించి నన్నెవరూ గమనించడంలేదని నిర్ధారించుకున్నాను. సంచీలోంచి నైలాన్ తాడున్న పొట్లాం బయటకులాగి, సత్తువపూని, గిరవాటేసాను.

పొట్లాం ఎగిరి తిన్నగా కుప్పల మధ్యపడింది. చెత్త గుట్టల్లో అదో భాగమైపోయింది మరుక్షణంలో.

ఆ ప్లాస్టిక్ సంచీ వదిలించుకోవడానికి కూడా యింతే చేసుంటే, యీ కంగారు తప్పివుండేది.

తృప్తిగా ఊపిరిపీల్చి, వెనుదిరగబోయాను.

"హేండ్సప్ వినాశ్ గారూ!"

వెనుకనించి వినిపించిన పరిచయమైన గొంతుక నన్ను నిశ్చేష్టుడ్ని చేసింది.

ఆ గొంతు సబిన్స్పెక్టరు సీతాపతిది.

ఇద్దరు జవానులు నా ముందుకొచ్చి, నా చేతులకు బేడీలు తగిలించారు. ఒక కానిస్టేబుల్ వెళ్ళి నేను విసిరేసిన పొట్లం పట్టుకువచ్చాడు.

"ఏమిటిది? ఎందుకు నన్ను అరెస్టు చేస్తున్నారు?" అరిచాను కోపం, దుఃఖం మిళితమైన గొంతుకతో.

"ఎందుకా? వినీలను హత్య చేసినందుకు!" చెప్పాడు సబిన్స్పెక్టరు మెల్లగా.

"నో! నో! నేను ఆమెను హత్య చెయ్యలేదు," ఆవేశంగా అన్నాను.

"అయితే, మీ రెందుకిలా వచ్చారు యిక్కడికి?" అడిగాడు సబిన్స్పెక్టరు.

నేను నోరు మెదపలేకపోయాను.

"మిస్టర్ వినాశ్! మీ రెంత బుకాయించినా యిహ లాభంలేదు. 'మిమ్మల్ని పట్టడానికి వేసిన ట్రాప్ యిది' అని మీరింకా గ్రహించలేదంటే ఆశ్చర్యంగా వుంది. ఇప్పుడు వినండి అసలు కథ. మా పోలీసులకు దొరికిన ప్లాస్టిక్ సంచీలో ఒక నగదు రశీదు వుంది. తన వద్ద మందులు కొన్నందుకు మందుల దుకాణం వాడిచ్చిన బిల్లు అది. నీటి తడికి, దానిమీద పెన్సిలు అక్షరాలు చెరిగి పోయాయి. అయితే, ప్రింటెడ్ అక్షరాలు స్పష్టంగానే వున్నాయి.

ఆ బిల్లు పరమేశ్వరీ ఫార్మాటికల్స్, విశాఖపట్నం వాళ్ళు యిచ్చింది. బిల్లు సీరియల్ నెంబరు 396. మేం వెళ్ళి షాపులోని డూప్లికేటు చెక్ చేసాం. ఆ బిల్లుమీద వి. రాజేశ్వరరావు అని వుంది. అయితే ఆ వ్యక్తి యెవరు?

అని కొట్టువాడ్ని అడిగాం. వాడికేం తెలీదన్నాడు. హోటల్లో కనుక్కున్నాం. మీ పేరే అది అని చెప్పారు.

అయితే, మీ బిల్లు పొరపాటున హంతకుడి సంచీలోకి వెళ్లిందేమో అనుకున్నాం. ఆ సంగతి తేల్చుకునేందుకే చిన్న టెస్ట్ చేసాను. ఆ ప్లాస్టిక్ సంచీ చూపినప్పుడు మీ మొహంలోని భావాల్ని కనిపెట్టడమే గాకుండా, మిమ్మల్ని వెంబడించాం. మీ గదిలోని మిగతా నైలాన్ తాడు కాయితంలో వుండగా చుట్టి చెత్తకుప్పలమీద విసిరేయడం మా అనుమానాల్ని ధృవపరిచింది. ఇంతకీ, మీరీ హత్య ఎందుకు చేసారో అర్థంగాకుండా ఉంది, రచయితగారూ!'' అన్నాడు సీతాపతి, తన ఉపన్యాసం ముగిస్తూ.

ఇంక వాళ్ళను యేమార్చే శక్తి నాకు లేదని గ్రహించాను.

''తెలివిగా జరిగిన ఒక యదార్థం గురించి పుస్తకం రాయాలనుకున్నాను. పోలీసు వాళ్ళ రికార్డుల్లో అలాంటి గట్టికేసేదీ లేదని తెలియగానే, నేనే ఆ హత్యచేసి, తప్పించుకుని దాని ఆధారంగా పుస్తకం రాయాలని నిశ్చయించుకున్నాను. అయితే, ఎంత తెలివిగా చేసినా నేరం దాగదు. దైవం నేరాన్ని క్షమించదు. అందువల్లనే, మనుషులు తిరుగాడని చోట ఆ ప్లాస్టిక్ బేగ్ సముద్రంలో పారేసినా, అది ఒడ్డుకువచ్చి మీకు దొరికింది. అంతేగాదు. పొరబాటున అందులో నేను మరిచిపోయిన మందుల బిల్లు నన్ను నూటిగా పట్టిచ్చింది'' అన్నాను.

''సారీ గురువుగారూ!'' అంటూ ముందుకు సాగిపోయాడు సీతాపతి. అతడ్ని అనుసరించాను తలవంచుకుని.

—: ఐపోయింది :—